
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 23.10.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 21 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# బుద్ధం.. శరణం.. గచ్ఛామి

## ➤ అమరావతిని దలైలామా కరుణించేనా?

## ➤ చంద్రబాబు నమ్మకం కూడా అదేనా?

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. విభజనతో ఏపికి అప్పులే మిగిలాయి. ఆస్తులను, వార్షిక ఆదాయాన్ని తెలంగాణ రాష్ట్రం పట్టుకు... సారీ, కొట్టుకుపోయింది. నెలకొచ్చేసరికి ఉద్యోగులకు జీతాలివ్వడానికి వెదుక్కోవాల్సిన పరిస్థితి. ఏ ప్రాజెక్టుకూ, ఏ పథకానికీ నిధులు లేవు. నిధుల లేమితో గత ప్రభుత్వాలు పెట్టిన అనేక సంక్షేమ పథకాలు మూలనపడుతున్నాయి. ఇంకో పక్క చూస్తే కేంద్ర ప్రభుత్వం ఆశించిన సాయం చేయడం లేదు. ముఖ్యంగా చంద్రబాబు కలల సౌధం అమరావతి రాజధానికైతే కేంద్రం సహకరించే అవకాశం కూడా కనిపించడం లేదు. మరి ఇంత గడ్డు పరిస్థితుల్లో చంద్రబాబు ఏ ధైర్యంతో అమరావతి రాజధాని నిర్మాణం పెట్టుకున్నట్లు? అనేది చాలామంది ప్రశ్న!**

బుద్ధం శరణం గచ్ఛామి... ఇదే చంద్రబాబు నమ్మకం. ఇదే రాజధాని నిర్మాణంలో ఆయనకు భరోసా అని తెలుస్తోంది. బుద్ధుడిపై భారం వేసి ఆయన రాజధాని నిర్మాణం మొదలుపెట్టాడు. అమరావతి పేరును గాని, ప్రాంతాన్ని గాని అందుకే రాజధానికి ఎంచుకున్నాడు. రాజధాని ద్వారా రెండు రకాల ప్రయోజనాలను చంద్రబాబు, ఆయన అనుచరులు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటి కృష్ణానది తీరం కేంద్రంగా అమరావతిని కలుపుకుంటూ రాజధానిని ఎంపిక చేసారు. ఇప్పటికి 34వేల ఎకరాల దాకా భూసేకరణ జరిగింది. ఇది త్వరలో 50వేల ఎకరాలకు చేరినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. రైతులకు పరిహారమిచ్చేదేమీ లేదు. కాబట్టి ప్రభుత్వానికి, లేదా ప్రైవేట్ సంస్థలకు పెట్టుబడేమీ లేదు. కాకపోతే అభివృద్ధి పేరుతో భూమిని ఎక్కువ భాగం ప్రైవేట్ సంస్థలకు, తక్కువ భాగం రైతులకు పంచనున్నారు. ఎక్కువ శాతం భూమి ప్రభుత్వం లేదా డెవలప్‌మెంట్ ఏజన్సీల చేతుల్లో వుంటుంది. కాబట్టి రాజధానికి వచ్చే వారితో వ్యాపారం చేసుకుంటుండొచ్చు. అయితే ఇక్కడ ఏమీ లేకుండా భవనాలు కట్టి స్థలాలు (మిగతా 11వ పేజీలో)

## • నెల్లూరు స్మార్ట్ సిటీ...

# వరమా? భారమా?



11లో

## • జగన్ వైఖరి




# తప్పా? ఒప్పా?

## ➤ ఆహ్వానం తిరస్కరించడం సమంజసం కాదు

## ➤ శంకుస్థాపనకు రాననడం సమర్థనీయమే

**భారతీయ సమాజంలో కొన్ని సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటిస్తుంటారు. వాటిని ఆచరించినప్పుడే వాళ్లకు విలువ, గౌరవం కూడా! శత్రువులు సైతం తమ ఇంట్లో శుభకార్యాలకు ఆహ్వానిస్తే వెళ్లడం... మన సంస్కృతిలో భాగం. మీ ఇంట్లో వేడుకకు మమ్మల్ని పిలవొద్దు, మేం రాము అని ముందుగానే చెప్పడం సాంప్రదాయ విలువలను పక్కన పెట్టడమే అవుతుంది.**

అమరావతి రాజధాని శంకుస్థాపన ఆహ్వానం విషయంలో ప్రతిపక్ష నేతగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి వైఖరిపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. శంకుస్థాపనకు నేను రానని, నాకు ఆహ్వాన పత్రిక పంపొద్దని ఆయన ముందుగానే ప్రకటించారు. ఆయనను ఈ విధంగా మాట్లాడమని ఎవరు సలహా ఇచ్చారోగాని, ఈ విషయంలో ఆయనను తప్పు దారి పట్టించనట్లేననుకోవాలి. ఏ కార్యానికైనా సరే 'నన్ను పిలవొద్దు' అనే మాటను ఈ సమాజంలో ఎవరూ సమర్ధించరు. జగన్ ఏం చేసుండాలంటే ఆహ్వానాన్ని స్వీకరించి వుండాలి. ఈరోజు కేసీఆర్ అంతటివాడు ఆహ్వానాన్ని మన్నించి శంకుస్థాపనకు వచ్చాడు. అంత మాత్రాన ఆయనకు చంద్రబాబు మీద అభిమానం పొంగుకొచ్చిందని భావించలేము. చంద్రబాబు పోయి ఆహ్వానించాడు. ఆయన కూడా మర్యాదగా చంద్రబాబును స్వాగతించి, (మిగతా 11వ పేజీలో)



## డిసెంబర్లో
# బీజేపీ సంస్థాగత ఎన్నికలు

భారతీయ జనతాపార్టీ సంస్థాగత ఎన్నికలు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి 10 వరకు గ్రామ కమిటీల నియామకం, 15 నుంచి 25 వరకు మండల కమిటీలు, డిసెంబర్ 1 నుంచి 10లోగా జిల్లా అధ్యక్షుల ఎన్నికలు జరుగుతాయన్నారు. డిసెంబర్ చివరికి రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక పూర్తవుతుం దన్నారు. జిల్లా అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి ప్రతి మండలాధ్యక్షుడితో పాటు పార్టీ ప్రతినిధికి ఓటు హక్కు ఉంటుందన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి 31వరకు జిల్లా స్థాయిలో ఎన్నికల అధికారుల వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ నేతలు ఎస్ఎస్ఆర్ నాయుడు, బందారు శ్రీనివాసులు, వేమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, జనార్ధన్, వాజ్‌పాయి పాల్గొన్నారు.

# విషజ్వరాలతో మృత్యువాత


నెల్లూరుజిల్లాలో డెంగీ మహమ్మారి విజృంభించి విలయతాండవం చేస్తుంది. గూడూరు నియోజకవర్గంలో ఆదివారం డెంగీ విషజ్వరాలతో అయిదుమంది మృతి చెందారు. గూడూరు మండలంలో డెంగీ బారిన పడి ఇద్దరు మృతి చెందగా, కోట మండలంలో జ్వరంతో ప్రధానోపాధ్యా యుడు, మరో యువకుడు డెంగీతో మృతి చెందారు. బోగోలు మండలం ఏనుగులబావి మాజీ సర్పంచ్ పి.వెంకటేశ్వర్లు జ్వరంతో మృతి చెందారు. గూడూరు మండలం చెన్నూరు గ్రామంలోని కాపువీధికి చెందిన దండు భాస్కరరెడ్డి కుమార్తె దివ్య(23) అనే వైద్య విద్యార్థిని, కోట వీధి ప్రాంతానికి చెందిన పముజుల శ్రీనివాసులు కుమార్తె హరిత(11) అనే 5వ తరగతి విద్యార్థిని ఆదివారం డెంగీతో మృతి చెందారు.

దీంతో డిఎంహెచ్ఓ ఆదేశాలతో జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ సుధాకర్, స్థానిక వైద్యులు గ్రామంలో పరిశీలించారు. గ్రామంలో అపరి శుభ్రంగా వున్న డ్రెయిన్లు, మురుగు కాలువల్లో చెత్త తొలగింపు, రక్షిత నీటి పథకాలకు క్లోరినేషన్ చేయించేలా పంచాయితీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి జ్వర పీడితుల వివరాలను వైద్యబృందం సేకరిస్తోంది.

సింహపురి సమాచారం

## ప్రకాశం జిల్లా ప్రమాదంలో
# నెల్లూరీయుల దుర్మరణం

పెళ్లి వేడుకల్లో పాల్గొనేందుకు ఆనందంగా సాగుతున్న ప్రయాణం పెనువిషాదంగా మారింది. మృత్యువు దారి కాచి ఒక్కసారిగా పంజా విసిరింది. ప్రకాశం జిల్లా కందుకూరు మండలం చెర్లోపాలెం వద్ద 17వ తేదీ తెల్లవారుజామున పెళ్లి బృందం ప్రయాణిస్తున్న డిసిఎం వాహనాన్ని బస్సు ఢీకొన్న ప్రమాదంలో 15మంది దుర్మరణం పాలయ్యారు. మరో 29మంది గాయపడ్డారు. మృతుల్లో ఆరు మంది నెల్లూరుకు చెందినవారున్నారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు కూడా వున్నారు. అతివేగం, నిద్రలేమి వల్ల మూల మలుపులోనూ వేగాన్ని తగ్గించని బస్సు డ్రైవర్ పెళ్లి బృందంతో వెళ్తున్న డిసిఎంను ఎదురుగా వచ్చి ఢీకొట్టి ఈ ఘోర దుర్ఘటనకు కారణమయ్యాడు. గుడ్లూరు మండలం చేవూరు నుంచి మాలకొండ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో వివాహానికి బయలుదేరిన డిసిఎం లారీలోని 15మంది మృతి చెందడంతో ఆ ప్రాంత మంతా రోదనలతో భీతిల్లింది. గుడ్లూరు మండలం పూరేటిపల్లికి చెందిన మహేంద్ర, చేవూరుకు చెందిన సురేఖకు శనివారం ఉదయం 7.30గంటలకు మాలకొండ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వివాహం నిశ్చయించారు. పెళ్లికుమారుడు, పెళ్లి కుమార్తె కారులో అక్కడికి వెళ్లిపోయారు. చేవూరు నుంచి పెళ్లికుమార్తె తరపు బంధువులతో కలిసి ఉదయం 5గంటలకు డిసిఎం లారీలో మాలకొండకు బయలుదేరారు. ఈ వాహనం కందుకూరు దాటాక వాలేటివారి మండలం చర్లోపాలెం వద్దకు రాగానే ఉదయం 6.30గంటల సమయంలో ప్రైవేటు బస్సు డిసిఎం ఇంజిన్ వెనుకనున్న ట్రాలీ అంచును ఢీకొట్టి కుడివైపు భాగాన్ని నుజ్జునుజ్జు చేస్తూ ముందుకు వెళ్లి బోల్తా పడింది. దాంతో లారీ నుంచి ట్రాలీ విడిపోయి పడిపో యింది. అందులో వున్న వారిలో 14 మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఆదినారాయణ అనే బాలుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మరో 27మందితో పాటు బస్సులోని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. డిసిఎం లారీని ఢీకొట్టిన బస్సు రోడ్డు కుడివైపు గుంతలో పడిపోయింది. అందులోని డ్రైవర్‌తో పాటు మరో సహాయకుడు గాయపడ్డారు. బస్సు బోల్తా పడిన వెంటనే మంటలు రేగడంతో వారు బయటకు వచ్చారు. అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మం టలు అదుపులోకి తీసుకొచ్చారు. డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని ఏఎస్పీ రామనాయక్ స్పష్టం చేశారు.




# వైద్య ఆరోగ్యశాఖలో బయోమెట్రిక్

నెల్లూరుజిల్లాలో ప్రప్రథమంగా ఆరోగ్యశాఖలో 17కస్టర్లతో 74 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పిహెచ్‌సి) కలెక్టర్ బయోమెట్రిక్ పరికరాలను అమర్చారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలను అంటురోగాలు పట్టి పీడిస్తున్నా వాటి నివారణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నా, ఆ శాఖ సిబ్బంది మాత్రం వైద్యసేవలను అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అలా వచ్చి అలా వెళ్లి పోతున్నారు. ఇప్పుడు అలాంటి మొక్కుబడి విధులకు కాలం చెల్లింది. బయోమెట్రిక్ విధానం అమల్లోకి వచ్చేసింది. ఇక సిబ్బంది ఎన్ని వేషాలు వేసినా తక్షణమే ఉన్నతాధికారులకు చిక్కిపోతారు. ఆయా వైద్యశాలల్లో అనుసంధానం చేసిన పరిక రాలు కార్యాలయ సిబ్బంది హాజరును, పని గంటలను, సమయపాలనను పరీక్షిం చేందుకు బయోమెట్రిక్ విధానం అను కూలంగా పనిచేస్తుంది. అదే విధంగా సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఉదయం 9గంటలకు వచ్చి బయోమెట్రిక్ పరికరంలో హాజరు వేసుకుని తమ విధు ల్లోకి వెళ్లి తిరిగి సాయంత్రం 4గంటలకు వచ్చి బయోమెట్రిక్ పరికరంలో ముగింపు హాజరును నమోదు చేసుకుని వెళ్లాల్సిందే. బయోమెట్రిక్ విధానాన్ని కీలకమైన అన్ని ప్రభుత్వ శాఖల్లో అమల్లోకి తెస్తే అర్హులం దరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్నారు.

# నెల్లూరును దోమలకు వదిలేసారు!



నెల్లూరు నగరాన్ని రాజవంశస్థులు పరిపాలించారని, ఇప్పుడు దోమలు పరిపాలిస్తున్నాయని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమూయర్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 20వ తేదీన ఆయన నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ అజీజ్‌పై తీవ్రంగా విమర్శలదాడి చేశారు. మేయర్ నెల్లూరు జనాన్ని ముదురుదోమలకు వదిలి పెట్టాడు. దసరా కానుకగా జనానికి దోమలను, డెంగ్యూ జ్వరాలను అందించాడు. మేయర్ మాత్రం నిద్రలేస్తే ఎక్కడ దొంగ బిల్లులు పెట్టుకోవాలి, కాంట్రాక్టర్ల నుండి ఎంత కమిషన్‌లు దండుకోవాలనే దాని మీదే పడుంటాడు తప్ప జనం బాధలు పట్టడం లేదు. నీళ్లు-మట్టిపై చూపినంత శ్రద్ధ ప్రజల సమస్యలపై చూపడం లేదు. నగరంలో ఈరోజు సరాసరిన ఇంటికొకరు జ్వరంతో బాధపడుతున్నారు. నెల్లూరులో కార్పొరేట్ ఆసుపత్రులతో పాటు 60ప్రైవేట్ ఆసుపత్రులు, ఇవి కాక ప్రభుత్వ ఆసుపత్రులు కూడా వున్నాయి. డెంగ్యూ పేషంట్‌లకు వీటిల్లోనే బెడ్‌లు లేక చెన్నైకి పరుగులు తీస్తున్నారు. ఏసి సుబ్బారెడ్డి, రమేష్‌రెడ్డి, ఆనం వివేకా నందరెడ్డి, అనూరాధ, భానుశ్రీ వంటి వారంతా నెల్లూరు నగరాన్ని పాలించారని, వారి కాలంలో ఎప్పుడూ ఇంత దారుణ పరిస్థితులు లేవని మయూర్‌రెడ్డి పేర్కొన్నారు.

## లోకేష్‌ను ఆహ్వానించిన అజీజ్



నెల్లూరులో ఈ నెల 24 నుండి 28 వరకు జరిగే బారాషహీద్ దర్గా రొట్టెల పండక్కి రమ్మని తెలుగుదేశంపార్టీ కేంద్ర ప్రధానకార్యదర్శి నారా లోకేష్‌ను మేయర్ అబ్దుల్ అజీజ్ ఆహ్వానించారు. మంగళ వారం విజయవాడలోని తెలుగుదేశం కార్యాలయంలో ఆయన లోకేష్‌ను కలిసి ఆహ్వానించారు.

## ఆకట్టుకున్న జాతీయ స్థాయి సంగీత, నృత్య సంబరాలు





సంస్కృతి తరంగాలు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో ఈ నెల 16 నుండి 18వ తేదీ వరకు జరిగిన దసరా సంగీత నృత్య సంబరాలు ఆకట్టుకున్నాయి. 16వ తేదీ జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ మునికుమార్ జ్యోతి ప్రకాశనం చేసి మాట్లాడుతూ కళల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రారంభ కార్యక్రమంగా చిన్నారి రేణిగుంట సుమేధ శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సంగీత పోటీల్లో పలు ప్రాంతాలకు చెందిన గాయనీగాయకులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. సాయంత్రం విజయవాడ ఆకాశవాణి కేంద్రం సంగీత దర్శకుడు, ప్రముఖ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ బృందం సంగీతకచ్చేరి అలరించింది.

17వ తేదీ జరిగిన కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుగ్రహీత డా॥ ముప్పవరపు సింహాచలశాస్త్రి గురుగుహోదయం హరికథాగానం వీనులవిందుగా సాగింది. 18వ తేదీ జరిగిన కార్యక్రమంలో వరంగల్‌కు చెందిన కుమారి కాట్రగడ్డ హిమాన్సీచౌదరి ప్రదర్శించిన స్వాగతం కృష్ణ కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం వరంగల్‌కు చెందిన ప్రప్రథమ తెలంగాణ ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత, ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు బూమ్‌పల్లి సుధీర్‌రావుకు ట్రస్టు తరపున జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేసి గజమాల, జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. అనంతరం మధ్యప్రదేశ్ ఉజ్జయినికి చెందిన రాజశ్రీ పురాణి బృందంచే కథక్ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను కట్టి పడేసింది. ట్రస్టు వ్యవస్థాపకులు రేణిగుంట రాజశేఖర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కావలి మార్కెటింగ్ కమిటి అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, డా॥ జయచంద్ర, బి.వి.నరసింహం, సి.మునికుమార్‌లు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా మహాలక్ష్మి వ్యవహరించింది.

# దసరా సందడిని కాజేసిన కరువు

ఈసారి విజయదశమి పండుగపై కరువు ప్రభావం బాగానే పడింది. దసరా అంటేనే సరదా పండుగ. జనం విందులు, వినోదాలతో తులతూగడమేకాదు, కొత్త వ్యాపారాలు, కొత్త ఇళ్లు శంకుస్థాపన, గృహప్రవేశాలు, కొత్త దుకాణాల ప్రారంభం వంటివన్నీ కూడా దసరా రోజునే జరుగుతాయి. విజయదశమి పండుగే విజయాలకు సూచిక. కాబట్టి ఈ పండుగ హిందువులకు ఎంతో ముఖ్యమైనది.

కరువు ప్రభావంతో ఈసారి దసరా కళ కాస్తా తగ్గినట్లయ్యింది. రైతులు బాగుంటేనే పండుగలు సందడిగా జరుగుతాయి. జిల్లాలో రైతుల పరిస్థితి ఏ మాత్రం బాగాలేదు. ఈ ఏడాది జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని వున్నాయి. అక్టోబర్ నెలలో కూడా మే నెల ఎండలు కాస్తున్నాయి. చిత్తకార్తెలో చినుకు లేకపోగా ఇది రోహిణికార్తెను తలపిస్తోంది. జిల్లాలో రెండోకారు పైర్లే లేవు. దీంతో రైతుల వద్ద డబ్బులు లేవు. ఇక జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా నీరసంగా వుంది. రియల్టర్లు అప్పులకు వడ్డీలు కట్టలేక చస్తున్నారు. రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగాలు ఊపు మీద లేకపోవడంతో సంబంధిత వ్యాపారాలు కూడా నిస్సారంగానే వున్నాయి. దీనికితోడు జిల్లాలో మరో ఆదాయవనరైన ఆక్వా రంగం పరిస్థితి కూడా ఏడ్చినట్లే వుంది. దీనిలోనూ రైతులు ఒడిదుడుకులనెదుర్కొంటున్నారు.

ఈ ప్రభావం అన్ని వ్యాపారాల మీద పడింది. దసరాకు అన్ని వ్యాపారాలు కూడా జోరుగా వుండాలి. బట్టల దుకాణాలు కిటకిటలాడాలి. ప్రొవిజన్స్ షాపులు రద్దీగా వుండాలి. బంగారు అంగళ్లలో బిజీ వుండాలి. కాని ఈసారి అంత సందడేమీ లేదు. అదీగాక నిత్యావసర వస్తువులు, పప్పు దినుసుల రేట్లు చుక్కలు చూపిస్తుండడంతో పండుగ శోభ తగ్గింది.

## కలక్టరేట్ వెలిగింది



అమరావతి రాజధాని శంకుస్థాపన నేపథ్యంలో నెల్లూరు కలెక్టరేట్ విద్యుత్ వెలుగులతో ధగధగ వెలిగిపోయింది. ప్రతి ఏటా జనవరి 26 రిపబ్లిక్‌డే, ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజుల్లోనే కలెక్టరేట్‌కు విద్యుత్ అలంకరణ చేస్తారు. ఇప్పుడు ప్రత్యేకంగా రాజధాని శంకుస్థాపన కోసం విద్యుత్‌దీపాలతో అలంకరించడం విశేషం.

## ఆహారంతో ఆకలిపై విజయం




నెల్లూరులో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల ప్రశంసలందుకుంటున్న మాగుంట శరశ్చంద్రారెడ్డి యువజన సేవా సమితి బృందం ఈ నెల 16న ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. సమితి అధ్యక్షులు సాయి బాబు ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆహార భద్రతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆహారాన్ని వృధా చేయకుండా ఉన్నవాళ్లు లేని వాళ్లకు పంచితే ఆకలిని తరిమి కొట్టొచ్చని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అక్కడున్న పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు అశోక్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాన్‌లో వ్యాసపూజ



నెల్లూరు, కొండాయపాలెంరోడ్డులో వున్న ఇస్కాన్ మందిరంలో మందిర ప్రతినిధి డాక్టర్ శుకదేవస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 19వ తేదీన వ్యాస పూజలు నిర్వహించారు. స్వామి రాధాకృష్ణుల విగ్రహాలను ఆవిష్కరించారు. మందిర ఆవరణలో భక్తులతో కలిసి కదంబ మొక్కలను నాటడంతో పాటు నూతన గోశాలను ప్రారంభించారు. అలాగే గాయత్రి థర్మల్ విద్యుత్ కేంద్రం వారు అందజేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను కూడా ప్రారంభించారు. మందిరంలో శ్రీకృష్ణ, బలదేవ, సుభద్రలను విశేషరీతిలో అలంకరించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

## భక్తులకు స్వీట్స్ పంచిన అరుణమ్మ



దసరా నవరాత్రులు సందర్భంగా జొన్నవాడలోని శ్రీ మల్లిఖార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయం వద్ద భక్తులకు మంగళవారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి పందిళ్లపల్లి అరుణమ్మ మిఠాయిలు పంపిణీ చేశారు. తన కుటుంబసభ్యులతో కలిసి ఆమె ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏటా ఆమె 50కేజీల మిఠాయిలను భక్తులకు పంచిపెడుతుంటారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కిరణ్, నవీన్, మహేష్‌లు కూడా పాల్గొన్నారు.

# పతకాల ఈతగాళ్లకు సత్కారం



ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాజధాని బోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన మాస్టర్ స్విమ్మర్లను ఈ నెల 18న నెల్లూరు పెన్నానది తీరంలో పినాకిని స్విమ్మింగ్ అసోసియేషన్ వారు ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయి పోటీలలో హరిసింగ్, చొక్కలింగం రజత పతకాలు సాధించారు. అలాగే అంతకుముందు రాష్ట్ర స్థాయి ఈతపోటీలలో హరిసింగ్, చొక్కలింగం, జ్ఞానశేఖర్, శేషు, శివకోటారెడ్డిలు వివిధ విభాగాల్లో ఆరు స్వర్ణ పతకాలు, నాలుగు రజతపతకాలు, రెండు కాంస్య పతకాలు గెలిచారు. స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య వీరి ప్రతిభను అభినందించి సత్కరించారు. అలాగే గత నాలుగేళ్లుగా పెన్నానదిలో స్విమ్మింగ్ శిక్షణనిస్తూ మంచి ఈతగాళ్లను తయారుచేస్తున్న శిక్షకుడు సుబ్బారాయుడిని కూడా సత్కరించి అసోసియేషన్ ద్వారా 20వేలు, డాక్టర్ దేవరాజ్ ద్వారా 10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.రూప్‌కుమార్ యాదవ్, నూనె మల్లిఖార్జునయాదవ్, మహిళా పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ నారాయణరావు, స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు దువ్వూరు శరత్‌చంద్ర, మునగా నాగేశ్వరరావు, సత్యం, సనత్‌కుమార్, కృష్ణారెడ్డి, సెల్వంలు పాల్గొన్నారు.

# 'ప్రభా'తం

ప్రపంచంలోనే అత్యంత సుందర నగరంగా నవ్యాంధ్ర రాజధాని 'అమరావతి'ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పించి, ఆ మేరకు శంకుస్థాపన మహోత్సవానికి రంగం సిద్ధం చేయడం సంతోషదాయకం. విభజనతో కనీసం రాజధాని కూడా లేకుండానే అవతరించిన నవ్యాంధ్ర ఇప్పుడు సగర్వంగా మరింత మహోన్నత స్థాయిలో రాజధాని నిర్మాణానికి పూనుకోవడం అందరికీ గర్వకారణం. తెలుగుజాతి గర్వించదగిన విషయం ఇది. అందరికీ విజయాలను చేకూర్చే పర్వదినమైన విజయదశమి రోజున 'అమరావతి'కి శంకుస్థాపన జరగడం శుభసంకల్పమే. నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిగా 'అమరావతి' ప్రపంచఖ్యాతి పొందడానికి ఇది శుభసూచకమనే భావించవచ్చు.

ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి సాక్షాత్తూ ప్రధాని నరేంద్రమోడీ విచ్చేసారు. అమరావతి శంకుస్థాపన పూజావిధుల్లో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, జపాన్, సింగపూర్‌కు చెందిన మంత్రులు, మరెందరో ప్రముఖులు ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి విచ్చేసారు.

రాజధాని అంటే కేవలం పరిపాలనా కేంద్రం కాదని, ఆర్థిక కార్యకలాపాలకు అది వేదికగా వుండాలని, ఉపాధి అవకాశాలకు నెలవుగా వుండాలని, సేవారంగానికి కీలకం కావాలని.. మొత్తంగా రాజధాని అమరావతి ప్రతి ఒక్కరూ గర్వపడేలా వుండాలనే ఉద్దేశంతోనే దీనిని ప్రజా రాజధానిగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేస్తున్నారు. ఎక్కడా ఎలాంటి అపోహలకు తావు లేకుండా, పారదర్శకంగా పనులు చేస్తూ, రాజధాని నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నది ఆయన సంకల్పం. విద్య, వైద్యం, క్రీడలు, పరిశ్రమలు, సాంకేతిక రంగం వగైరా అన్ని రంగాలకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ రాజధాని నిర్మాణానికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. అన్ని వర్గాల ప్రజలకీ అనుకూలంగా వుండేవిధంగా రాజధాని నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. తొలిదశ నిర్మాణాలు మరో రెండేళ్ళలో పూర్తయ్యేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఎంతో ప్రాచీనకాలం నుంచి అమరావతి చరిత్ర ప్రసిద్ధి చెందిన నగరంగా వుండడం ఇప్పుడు కలసివచ్చే అంశమైంది. అమరావతికి పూర్వవైభవం తీసుకురావాలనే కృషితో ప్రభుత్వం, అధికార యంత్రాంగమంతా కృషి చేస్తోంది. అమరావతి నగరానికి సుమారు 32 కిలోమీటర్ల పొడవున్న నదీ తీరప్రాంతం వుంది. ఈ ప్రాంతానికి కృష్ణా నది ఒక వరం. అంతేకాక, రాజధాని మధ్య నుంచి కొండవాగు వెళ్తుండడం, వీటిని అనుసంధానిస్తూ కాలువలను క్రమబద్ధీకరించి, తద్వారా నగరాన్ని హరితనగరంగా తీర్చిదిద్దేందుకు ఎంతో అవకాశం వుంది. అమరావతిని హరితనగరంగా తీర్చిదిద్దేందుకు వీలయ్యే వనరులన్నీ ఇక్కడ పుష్కలంగా వున్నాయి. ఇవన్నీ కూడా అమరావతికి కలసివచ్చే అదృష్టాలే. వీటన్నిటిని సద్వినియోగం చేసుకుని నగరాన్ని హరితనగరంగా రూపుదిద్దేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇకపోతే, రాజధాని శంకుస్థాపన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సంకల్పం తీసుకోవడం, ప్రతి గ్రామం నుంచి రాజధాని నిర్మాణ సంకల్పాన్ని తీసుకుని వాటిని కాలనాళికలో భద్రపరచడం వంటి పనులను ఎంతో దీక్షతో చేస్తుండడం సంతోషదాయకం.

విభజన కష్టాలతో అనేక రంగాలు బాగా వెనుకబడిపోయి, రాష్ట్రం పరిస్థితి అయోమయంగా వున్నప్పటికీ, రాజధాని లేని నవ్యాంధ్రకు ఇంత ఘనమైన రాజధాని నిర్మాణానికి పట్టిన పట్టు విడవకుండా కృషి చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు అందరి అభినందనలూ అందుకుంటున్నారు. ఏ రాష్ట్రానికైనా పరిపాలనకు అనువైన రాజధాని అత్యవసరం. రాష్ట్రాభివృద్ధికి బాటలు వేసేందుకు, అవసరమైన నిర్ణయాలు చేసేందుకు, రాష్ట్ర పురోభివృద్ధికి అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేసేందుకు రాజధాని తక్షణావసరం. ఆ సంకల్పాన్ని నెరవేర్చుకోవడానికి వేసే ప్రతి అడుగూ అభినందనీయమైనదే. రాజధానిని సుందరనందనంగా తీర్చిదిద్దాలనే సంకల్పం త్వరితగతిన నెరవేరాలని ఆశిద్దాం. రాజధాని నిర్మాణ విషయంలో భూముల సేకరణ విషయంలో ఇప్పటికే వున్న విమర్శలను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని, ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా రైతులంతా హర్షించేలా, నూతన రాజధాని నిర్మాణంలో అందరూ సంతోషంగా భాగస్వాములయ్యేలా చూడడం ఎంతో ముఖ్యం. అదేవిధంగా, రాజధాని నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి, పరిపాలనను చక్కదిద్ది రాష్ట్రంలోని అనేక సమస్యలను సరిదిద్దాల్సిన కర్తవ్యాన్నీ నెరవేర్చాల్సివుంది. ఎన్నో ఇబ్బందులు, ఇక్కట్లు ఎదురైనా రాష్ట్రానికో ధీటైన రాజధాని నగరాన్ని నిర్మించేందుకు సంకల్పించడం, అందుకు శంకుస్థాపన శుభారంభం కావడం, నవ్యాంధ్ర అభ్యున్నతికి నేనున్నానంటూ భరోసా ఇచ్చే మహోన్నత నేత ప్రధాని నరేంద్రమోడీ కూడా ఈ శంకుస్థాపన మహోత్సవానికి విచ్చేయడం, అదే రోజు విజయదశమి పర్వదినం కావడం.. నవ్యాంధ్ర భవితకు అంతా శుభ సూచకమే. ఇప్పటికే పేరుకుపోయివున్న సమస్యలను అధిగమించి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల సమగ్రాభివృద్ధికి బాటలు వేయాల్సిన శుభతరుణం రానే వచ్చింది. రాజధాని నగరంతో పాటు, రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నగరాలు, పట్టణాలు, గ్రామాల పురోభివృద్ధికి ఇదే సంకల్పం తీసుకోవాలి. రాష్ట్ర సమగ్రాభివృద్ధితోనే నవ్యాంధ్రకు నవోదయం కనుక, నవ్యాంధ్ర అంతటా వెలుగుబాటలు వేసేందుకు సమాయత్తం కావాలి. అప్పుడే తెలుగునేలకు అసలైన శుభోదయం.. అదే తెలుగుజాతికి మహోదయం. ఆ మంచిరోజు ఇక త్వరలోనే వస్తుందని ఆశిద్దాం. దివ్యమైన, భవ్యమైన నగరంగా, నవ్యాంధ్ర రాజధానిగా అమరావతి ప్రపంచప్రఖ్యాతి పొందాలని.. తెలుగుజాతి ఖ్యాతిని జగద్విదితం చేసేలా అమరావతి రూపుదిద్దుకోవాలని ఈ శుభసందర్భంలో అందరం మనసారా కోరుకుందాం!




## శుభ సంకల్పం

నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి నగర నిర్మాణానికి శంకుస్థాపన శుభారంభం కావడం సంతోషదాయకం. అదే రోజు విజయదశమి పర్వదినం కావడం.. నవ్యాంధ్ర భవితకు శుభసూచకమే. ఇదేవిధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల సమగ్రాభివృద్ధికి బాటలువేయాల్సిన శుభతరుణం ఇదే. రాష్ట్ర సమగ్రాభివృద్ధితోనే నవ్యాంధ్రకు నవోదయం కనుక, నవ్యాంధ్ర అంతటా వెలుగు బాటలు వేసేందుకు సమాయత్తం కావాలి. అప్పుడే తెలుగునేలకు అసలైన శుభోదయం.. అదే తెలుగుజాతికి మహోదయం.

# మద్యం ధరలకు రెక్కలు



మద్యం ధరలకు రెక్కలొచ్చాయ్... ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయాలు సాగించాలన్న నిబంధనకు సిండికేట్లు మంగళం పాడారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.5 నుంచి రూ.10వరకు పెంచి మందుబాబులకు ఇంకాస్త నిషా ఎక్కించారు. ఎక్సైజ్ అధికారులతో సిండికేట్లు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని ఎంఆర్‌పికి తిలోదకాలు ఇచ్చారు. ఇందుకు ఎక్సైజ్ అధికారులకు భారీమొత్తంలో ముట్టజెప్పినట్లు సమాచారం. నెల్లూరు, గూడూరు ఎక్సైజ్ పరిధిలో 313 ప్రైవేటు, 35 ప్రభుత్వ మద్యం దుకాణాలున్నాయి. 2015-17 సంవత్సరానికి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని విడుదల చేసింది. అందులో ఎంఆర్‌పిని ఖచ్చితంగా అమలు చేయాలని నిబంధన ఉంది. హోలో గ్రామ్, ట్రాక్ అండ్ ట్రేసర్ విధానం ఏర్పాటు చేసిన దుకాణదారులకే పర్మినెంట్ లైసెన్సులు మంజూరు చేయడంతో పాటు, బెల్టుషాపులను పూర్తి స్థాయిలో నిర్మూలించాలని ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. మద్యం విక్రయాల్లో అక్రమాలు జరగకుండా ఎంఆర్‌పి ధరలకే మద్యాన్ని అందుబాటులోకి తెచ్చి అందులో భాగంగా ప్రభుత్వమే మద్యం దుకాణాలు ఏర్పాటు చేసింది. అబ్కారీ సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ఏ దుకాణంలోనూ హోలోగ్రామ్, ట్రాక్ అండ్ ట్రేసర్ విధానం అమలు కావడం లేదు.

# ప్రకాశంజిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవాలకు ఆహ్వానం

ప్రకాశం జిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవ సభలకు తెలుగు కవులు, రచయితలను ఆహ్వానిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు బి.హనుమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంఘాన్ని స్థాపించి 50సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2016, జనవరి 8, 9, 10తేదీలలో ఒంగోలులోని టిటిడి కల్యాణ మండపంలో మూడురోజుల పాటు నిర్వహించే స్వర్ణోత్సవాల్లో జాతీయ స్థాయిలోని ప్రఖ్యాత కవులు పాల్గొంటున్నట్లు తెలిపారు. సాహిత్య సభలు, జాతీయ కవి సమ్మేళనం, ప్రతినిధుల కవి సమ్మేళనం, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవ సభలలో పాల్గొన్న ప్రతినిధులకు స్వర్ణోత్సవ జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో పాటు మూడురోజులు ఉచిత భోజన, సాధారణ వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుంది. ప్రతినిధులుగా పాల్గొనదలచిన కవులు, రచయితలు రూ.100/-లు డెలిగేట్ ఫీజుతో పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి, ఇంటి నెం.33-1-5, తిరువెంగళంపిళ్లై వారి వీధి, ఒంగోలు-523 001. సెల్. 9440432939ని సంప్రదించవలసినదిగా ఆయన కోరారు.




## పిచ్చి ముదిరితే...

పిచ్చి ముదిరితే తలకు రోకలి చుట్టమన్నారు. చంద్రబాబు రాజధాని పిచ్చి ఆ స్థాయికి చేరింది. రాజధాని శంకుస్థాపన ఆర్భాటం చూస్తే అదొక ప్రైవేట్ ఈవెంట్‌లాగా వుంది. ప్రజల కోసం కట్టే రాజధానికైతే ఇంత హంగామా అవసరం లేదు. శంకుస్థాపన ఖర్చుతో ఒక ప్రభుత్వ కార్యాలయ భవనమే పూర్తి చేసి వుండొచ్చు. రాజధాని మీద ఇంత పిచ్చి దేశంలో ఏ ముఖ్యమంత్రికి కూడా లేదు.

**తోట రాజశేఖర్, నెల్లూరు.**

## మన దరిద్రం

నితీష్‌కుమార్, నవీన్ పట్నాయక్, మమతా బెనర్జీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, రమణ్‌సింగ్ వంటి నిరాడంబరులు, నిజాయితీపరులైన నాయకులు మనకు లేకపోవడం దౌర్భాగ్యం. అధికార పార్టీ నేత చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్... ఇద్దరూ అవినీతి రాక్షసి బిడ్డలే! రాష్ట్రాన్ని దోచుకోవడంలో ఒకరినొకరు తీసిపోరు. వీళ్ల దరిద్రాన్ని వదిలించే మూడోశక్తి రాష్ట్రానికి అవసరం.

***గంగపట్నం పీటర్ సురేష్, కావలి.***

## అది వాస్తవ రూపం

తేది.16-10-15 సంచికలోని 'ఆవు ఆత్మక(వ్య)థ' సంపాదకీయం వాస్తవికతకు అద్దం పట్టింది. ఈ దేశంలో మెజార్టీ హిందువుల మనోభావాలను దెబ్బతీసే ప్రక్రియను మెజార్టీ పార్టీలు అనాదిగా కొనసాగిస్తున్నాయి. ఆవులను వధించకుంటే ఈ దేశానికి ఆర్థికంగా వచ్చే నష్టమేమీ లేదు. ఈ దేశంలో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలంటే గోవధను నిషేధించాలి. ఓ పక్క పిచ్చుకలు అంతరించిపోతున్నాయని బాధపడే మేధావులు అదే దయను ఆవులపై చూపరేం! **- సి.రాజీవి, నెల్లూరు.**

## గోవధను నిషేధించాలి

రాతి యుగంలో చెట్టు తొర్రలో వుంటూ మనిషి జంతు భక్షకుడిగా బ్రతికాడు. తర్వాత నాగరికత నేర్చుకున్నాడు. పశు సంపదను ఆస్తిగా భావించాడు. పశువుల కొరకు యుద్ధాలు కూడా జరిగాయి. వేదాలు, పురాణాలలో మాంస భక్షణ ఉన్నప్పటికి బౌద్ధం వచ్చాక జంతు హింస తగ్గి భూతదయ పెరిగింది. ఆవులాంటి సాధు జంతువును పూజాగోవుగా చూడసాగాడు. ఆవు హిందూ సంస్కృతిలో ఓ భాగం. దీనిని తినడం మహాపాపం అని నమ్ముతారు. కుహనా సెక్యులరిస్టులు గోవధ నిషేధాన్ని వ్యతిరేకించడం మూర్ఖత్వమే అవుతుంది. **- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# హద్దు దాటిన ఇసుక దోపిడీ!



*ఇసుక... అమ్మేవాడికి బంగారం, కొనేవాడికి బంగారం కన్నా ఎక్కువ. బంగారాన్నయినా దుకాణానికెళ్లి సులభంగా కొనుక్కోవచ్చు. ఇసుక కొనాలంటే మాత్రం ఇప్పుడు చాలా తతంగం నడుస్తోంది. ఇసుకను అంత ఖరీదుగా మార్చేసాయి మన ప్రభుత్వాలు.*

గత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు అధికారపార్టీ వాళ్లు తలా ఒక పని మీద పడేవాళ్లు. ఎవరి వ్యాపారాలలో వాళ్లు సంపాదించుకునేవాళ్లు. సమైక్యరాష్ట్రంలో ప్రభుత్వాలు రకరకాల పనులు చేస్తుండేవి. పెద్దఎత్తున సివిల్ పనులు జరిగేవి కాబట్టి ఎక్కువమంది నాయకులు కాంట్రాక్ట్ పనులు తీసుకుని నాలుగు రూపాయలు సంపాదించుకునే వాళ్లు. వై.యస్ హయాం వరకు కూడా సంపాదనకు పలు మార్గాలుండేవి కాబట్టి నాయకులు వాటి మీద పడేవాళ్లు. ఇసుక జోలికి కొద్దిమంది మాత్రమే వచ్చేవాళ్లు.

ఇప్పుడు చంద్రబాబు హయాంలో పరిస్థితి మారిపోయింది. విభజనతో ఆర్థిక లోటు వల్ల రాష్ట్రంలో పెద్దగా పనులు చేసే పరిస్థితి లేదు. అమరావతి రాజధానిని చంద్రబాబు తన ముఖ్యులకే పరిమితం చేసాడు. పట్టిసీమ పనులను సైతం సొంత మనుషులకే అప్పగిస్తున్నారు. కొత్త ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం, కాలువల నిర్మాణం, ఇతర సివిల్ పనులేవీ లేకపోవడంతో అధికారపార్టీ నాయకులు ఎక్కువగా ఇసుక, అధికారుల బదిలీల ద్వారా నాలుగు రూపాయలు సంపాదించడం మొదలుపెట్టారు.

నెల్లూరుజిల్లాలో ఇసుక దోపిడీ గతంలో ఎన్నడూ లేనంత యధేచ్ఛగా జరుగుతోంది. అడ్డు అదుపు లేకుండా ఇసుకను తవ్వేసి అధికారపార్టీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా ఇసుక అమ్మకం పెద్ద బూటకంగా మారింది. ఇసుకరీచ్‌లలో సిసి కెమెరాలు, వాహనాలకు ట్రాకింగ్ సిస్టం అమర్చడం వంటి ప్రయత్నాలేవీ ఇసుక అక్రమరవాణాను ఆపలేకపోతున్నాయి. జిల్లాలో కోవూరు, నెల్లూరురూరల్, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో ఇసుక రీచ్‌లున్నాయి. స్థానిక అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ రీచ్‌ల నుండి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. మిషన్లు పెట్టి మరీ ఎత్తేస్తున్నారు. ముఖ్యంగా ఈ వారంలో అయితే జిల్లా పోలీసు యంత్రాంగమంతా కూడా అమరావతికి బందోబస్తు కోసం తరలిపోవడంతో పెద్దఎత్తున వాహనాలు పెట్టి ఇసుకను తరలించారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో ఇసుకకు మంచి గిరాకీ వున్న నేపథ్యంలో ఆ ప్రాంతాలకు ఇసుకను తరలిస్తూ అక్రమార్జన పెంచుకుంటున్నారు. జిల్లాలో కొందరు అధికారపార్టీ నాయకుల రోజువారీ సంపాదన లక్షల్లో వుందంటే ఇసుక అక్రమ రవణా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

# హోదా కోసం ఘంటానాధం


## నెల్లూరులో వైకాపా నేతల వినూత్న నిరసన



ఈ నెల 18న ప్రత్యేకహోదా కోసం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు మేరకు రూరల్ నియోజకవర్గంలోని ఆమంచర్ల గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు డప్పులతో, గంటలతో ఘంటానాధ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున వైయస్సార్సీపీ కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. కిలోమీటరు మేర ట్రాఫిక్ ఆగిపోయింది.

ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, గుండాల మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహోదా ఆంధ్రుల జన్మహక్కు అనే నినాదంతో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఉద్యమాలను కొనసాగిస్తుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ప్రత్యేకహోదా సాధించి తీరుతామని, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంట నడుస్తూ జగనన్న చేస్తున్న ఉద్యమాలకు బాసటగా నిలుస్తూ ప్రాణాలైనా అర్పించి ప్రత్యేకహోదాను సాధించేందుకు సర్వప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మన్నవరపు రత్నమ్మ, మండల కన్వీనర్ వేమిరెడ్డి హరి శివారెడ్డి, జిల్లా కార్యదర్శి మలినేని వెంకయ్యనాయుడు, మన్నవరం మల్లయ్య, వెంకటేశ్వర్లునాయుడు, శ్రీనివాసులునాయుడు, చిరంజీవి, రాపూరు శేఖర్, మన్నవరం శివయ్య, ముస్తాక్, నరసింహులు, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, అల్లాభక్షు, ధనయ్య తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణపట్నం పోర్టుకు బాబు సపోర్ట్



*కృష్ణపట్నం పోర్టు... నెల్లూరుజిల్లా పారిశ్రామిక ప్రగతికి గుండెకాయ. ఈ పోర్టు లేకుంటే జిల్లాలో పారిశ్రామిక ప్రగతి అన్నది శూన్యం. 1995లో చంద్రబాబు శంకుస్థాపన చేసిన ఈ పోర్టును 2004లో వై.యస్. ముఖ్యమంత్రి అయ్యాక వేగ వంతంగా పూర్తి చేయించడం జరిగింది. జిల్లాకు వై.యస్. ఇచ్చిన వరమే కృష్ణపట్నం పోర్టు. ఇది వచ్చాక నెల్లూరుజిల్లాలో అభివృద్ధిపరంగా అనేక మార్పులొచ్చాయి. పరిశ్రమలొచ్చాయి. భూముల ధరలు పెరిగాయి. రైతులు, ఇంకొన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా లాభపడ్డారు. ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయి.*

2014 ఎన్నికల తర్వాత చంద్రబాబు సిఎం అయ్యాడు. ఈ ఒకటిన్నర ఏడాదిలో ఆయనెప్పుడూ నెల్లూరుజిల్లా అభివృద్ధి గురించి పాజిటివ్ ఆలోచన చేయలేదు. కారణం ఈ జిల్లాలో తన పార్టీకి సీట్లు తక్కువ రావడమే. మొదట్లో అయితే ఈ జిల్లాకు సంబంధించి ఏ పని కూడా అడగొద్దని నాయకుల ముఖాన్నే చెప్పాడు. కాని 'లాయర్' గతంలోనే చెప్పింది, నెల్లూరుజిల్లా సహజంగానే అభివృద్ధి చెందుతుందని, చంద్రబాబు కాదు కదా, ఏ బాబు కూడా ఈ అభివృద్ధిని అడ్డుకోలేడని! రేపు అదే జరగబోతోంది. చంద్రబాబే ఇప్పుడు దిగొచ్చి కృష్ణపట్నం పోర్టు పారిశ్రామిక హబ్‌గా మారబోతోందని ప్రకటించాడు. దీనికి కారణం ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న పారిశ్రామికవేత్తలంతా కూడా నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టు లేదా శ్రీసిటీల వైపు మొగ్గు చూపుతుండడమే!

పరిశ్రమలు స్థాపించడానికి నెల్లూరు జిల్లాలో వున్నంత అనువైన పరిస్థితులు ఏపిలోని మరే జిల్లాలో లేవు. ఈ జిల్లాలో సముద్రతీరం వెంబడి అనువైన భూములున్నాయి. కృష్ణపట్నం సెజ్‌లోనూ, శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లలోనూ పరిశ్రమలు పెట్టడానికి భూమి సిద్ధంగా వుంది. ఉత్పత్తుల ఎగుమతికి, దిగుమతికి కృష్ణపట్నం పోర్టు చాలా అనువుగా వుంది. ఇది ప్రైవేట్ పోర్టు కావడంతో నిర్వహణ బాగుండడం, లోడింగ్, అన్‌లోడింగ్ వేగంగా జరుగుతుండడం కూడా పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తోంది. ఇతర జిల్లాల్లో మాదిరిగా భూసేకరణలో పెద్దగా వివాదాలు తలెత్తవు. రాజకీయ మాఫియా బెదిరింపులుండవు. జల రవాణాతో పాటూ రోడ్డు రవాణా సులభతరంగా వుంది. ఇక దగ్గరలో చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం వుంది. త్వరలో తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం కూడా ప్రారంభం కాబోతోంది. ఈ రెండూ నెల్లూరు జిల్లాకు దగ్గర్లోనే వున్నాయి. చెన్నై మెట్రోపాలిటిన్ సిటీ కూడా నెల్లూరుకు దగ్గరగా వుండడం ఒక అవకాశమే. విశాఖ-చెన్నై, బెంగుళూరు-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో నెల్లూరుజిల్లా అంతర్భాగం. తమిళనాడులో చెన్నై పోర్టు, ఎన్నూరు పోర్టులు రద్దీగా ఉంటున్నాయి. అదీగాక ఆ పోర్టులకు వెళ్లాలన్నా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. కృష్ణపట్నం పోర్టుకు ట్రాఫిక్ సమస్య లేదు. కాబట్టి చంద్రబాబు మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండని ఆహ్వానించిన విదేశీ పారిశ్రామికవేత్తలందరూ కృష్ణపట్నం, శ్రీసిటీల వైపే మొగ్గు చూపడంతో చంద్రబాబు వారికి పచ్చజెండా వూపక తప్పలేదు.

## • మనీ స్కీం... అగ్రిగోల్డ్...

# ఆశలు వదులు కోవాల్సిందేనా?

*భారతదేశంలో ప్రజలకు ఉన్న అతి పెద్ద జాడ్యం మరచిపోవడం. ఇంకో కోణంలో దీనిని వరమని కూడా అనుకో వచ్చు. ఈరోజు ఒక సంఘటన జరుగు తోంది. దాని గురించి అదే పనిగా చర్చించు కుంటుంటాం. రెండోరోజు ఇంకో సంఘటన జరిగితే మొదటిదానిని మరచిపోతుంటాం. ప్రజలకు ఈ మరిచిపోయే స్వభావం ఉండడం ప్రభుత్వాలకు, పాలకులకు వరంగా మారుతోంది.*

అధికారంలో ఉన్న ప్రభుత్వం నాలుగేళ్ల తొమ్మిది నెలలు సక్రమంగా పనిచేసి, చివరి మూడు నెలల్లో ఏదన్నా ధరలు పెరగడమో, పన్నులు పెంచడమో చేసారనుకోండి... ముందుకాలంలో చేసిన మంచినంతా మరచిపోతారు, చివరి మూడు నెలల్లో వేసిన భారాన్ని గుర్తుపెట్టుకుని కసితో ఆ ప్రభుత్వాన్ని దించేస్తారు. అదే ప్రభుత్వం 4ఏళ్ల 9నెలు ఛండాలంగా పనిచేసి చివరి మూడు నెలల్లో ఋణమాఫీ వంటి ఆకర్షణీయ పథకాలు ప్రకటిస్తే ముందుకాలం జరిగిన చెడునంతా మరచిపోయి మళ్ళీ అధికారం కట్టబెడతారు.

ప్రజలకు ఈ మరచిపోయే స్వభావం రాజకీయ నాయకులకే కాదు, స్కీంల పేరుతో మోసం చేసే ఛీటర్స్‌కు కూడా బాగానే ఉపయోగపడుతోంది. నెల్లూరు జిల్లాలో ఫైనాన్స్ మోసాలకు ఉదాహరణలు కోకొల్లలుగా వున్నాయి. అయినా ఇంకా ఫైనాన్స్ మోసాలు జరుగుతున్నాయంటే కారణం అంతకుముందు జరిగిన మోసాలను మరచిపోవడమే!

జిల్లాలో ఓ పక్క మనీస్కీం బాధితులు... ఇంకో పక్క అగ్రిగోల్డ్ బాధితులు... తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియని గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారు. వందలకోట్ల రూపాయలు ఈ రెండింటి ద్వారా నష్టపోయారు. ఈ రెండింటికి బాధితులు జిల్లాలోనే వేలల్లో ఉన్నారు.

జిల్లాలో మనీస్కీం ఒక మతం ముసుగులో జరిగిన పెద్ద దోపిడీ రాకెట్. ప్రతి నెల పింఛన్‌లు ఇస్తామంటూ ఆశ చూపి మహిళల నుండి పెద్దమొత్తాలలో నగదు వసూలు చేసారు. రోజు కూలీలకు పోయే వాళ్లు, టిఫిన్ బండి, టీ బంకులు నడుపుకునేవాళ్లు ఈ మనీస్కీంలలో చేరారు. వందల కోట్లు పోగేసుకున్నాక ఈ మనీస్కీం ఏజెంట్లు చేతులెత్తేసారు. దీనిపై గతంలో డిజిపిగా పనిచేసిన జిల్లా వాసి దినేష్‌రెడ్డి సిబిడి దర్యాప్తుకు ఆదేశించడం తెలిసిందే! పోలీసులు కొందరు ఏజంట్ల నుండి భారీ మొత్తాలలో నగదును స్వాధీనం చేసుకోడం జరిగింది. కోర్టులో కేసు నడుస్తుంది, పోలీసులు విచారణ చేస్తున్నారు. మోసానికి పాల్పడ్డ ఏజెంట్లు దర్జాగా తిరుగుతున్నారు. ఎటొచ్చి బకరాలయ్యింది డబ్బులు పోగొట్టుకున్న బాధితులే! ఇంతవరకు ఏ ఒక్క బాధితురాలికి రూపాయి తిరిగి రాలేదు. ఇంకొన్నేళ్లు పోతే ఈ మనీస్కీం మరచిపోయే ఖాతాలో చేరిపోతుంది.

అలాగే అగ్రిగోల్డ్ కూడా ఈ బాపతే! ప్రజల సొమ్ముతో రకరకాల వ్యాపారాలు పెట్టింది ఈ సంస్థ. వేల ఎకరాలలో భూములు కొన్నారు. సంస్థకు ఆస్తులున్నాయి. అమ్మయినా బాధితులకు నగదు చెల్లించవచ్చు. కాని ఆస్తులన్నీ కోర్టులో ఉన్నాయి. బాధితులు బజారున పడ్డారు. డిపాజిటర్లకు నగదు చెల్లించే పరిస్థితుల్లో అగ్రిగోల్డ్ సంస్థ లేదు. బాధితులు మాత్రం ఆందోళనకు దిగుతున్నారు.

చరిత్రను తిరగేద్దాం... గతంలో ఎన్నో ఫైనాన్స్ మోసాలు జరిగాయి. ఏ సంస్థ నుండి కూడా బాధితులకు తిరిగి చెల్లింపులు జరిగిన దాఖలాలు లేవు. కాలం ముందుకు జరిగితే, జనం జరిగిందంతా మరచిపోతారనేది పాలకుల నమ్మకం.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నెల్లూరు కబుర్లు

## అపోలోలో న్యూరాలజీ ఐసియు



నెల్లూరు హరనాథపురంలోని అపోలో ఆసుపత్రిలో న్యూరాలజీ ఐసియూ విభాగాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తలుగా ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ అధ్యక్షులు, హైదరాబాద్‌కు చెందిన నిమ్స్ న్యూరాలజీ విభాగాధిపతి సుభాష్ కౌల్, త్రివేండ్రం శ్రీచిత్ర హాస్పిటల్ అధినేత డా॥ పి.ఎస్.శైలజ, చెన్నై అపోలో హాస్పిటల్ డా॥ జోయ్‌వర్గీస్‌లు పాల్గొన్నారు. సుభాష్ కౌల్ మాట్లాడుతూ పక్షవాతంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, పక్షవాతం సోకితే నాలుగున్నర గంటల్లోగా టిపిఏ ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా రోగిని కాపాడవచ్చని తెలిపారు. అపోలో న్యూరాలజీ అధిపతి బిందు మీనన్ మాట్లాడుతూ నరాల వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. టిపిఏ ఇంజక్షన్‌ను దేశంలోనే తొలిసారిగా వినియోగించిన సుభాష్‌కౌల్ చేతుల మీదుగా ఐసియూను ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న నెల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు యూనిట్ హెడ్ విష్ణువర్ధన్, డాక్టర్లు పాల్గొన్నారు.

## వైయస్సార్సీపీ 'ప్రత్యేక' బైక్‌ర్యాలీ



కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి 'ప్రత్యేకహోదా' ఇవ్వాలని కోరుతూ నెల్లూరు నగరంలోని రాజన్నభవన్ నుండి విజయమహల్‌గేటు, గాంధీ బొమ్మ, ట్రంకురోడ్డు, నర్తకి సెంటర్, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట మీదుగా నెల్లూరు నగర శాసన సభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో వైయస్సార్సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు పి.రూప్‌కుమార్‌యాదవ్ భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, ఎం.డి.ఖలీల్‌అహ్మద్, దేవరకొండ అశోక్, కొణిదల సుధీర్, హంజాహుస్సేనీ, మునీర్ సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్లన్నీ ఖాళీ

విజయదశమి రోజున నెల్లూరుజిల్లాలో పోలీసుస్టేషన్లన్నీ బోసిపోయినట్లు కనిపించాయి. దానికి నాలుగురోజులు ముందు నుండి కూడా ఇదే పరిస్థితి. జిల్లాలో వున్న పోలీసు అధికార యంత్రాంగం చాలావరకు అమరావతి రాజధాని శంకుస్థాపన బందోబస్తుకు తరలివెళ్లింది. ఇంకొందరు దసరా నవరాత్రులు కావడంతో జిల్లాలోని ముఖ్యమైన దేవాలయాల వద్ద బందోబస్తు విధుల్లో నిమగ్నం కావాల్సి వచ్చింది. స్టేషన్‌కు ఒకరిద్దరు సిబ్బంది మాత్రమే మిగిలారు. ఎక్కడన్నా దోపిడీ, దొంగతనం లాంటివి జరిగాయని ఫిర్యాదులు వచ్చినా పోలీసులు పోలేనంతగా పోలీసు స్టేషన్‌లు ఖాళీ అయ్యాయి.

## మైనార్టీలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఆంధ్రప్రదేశ్ మైనారిటీ సంక్షేమశాఖ వారి సహకారంతో ఉర్దూ అకాడమీ ఉచిత కంప్యూటర్ శిక్షణనిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై 35ఏళ్ల లోపు వయసున్న ముస్లిం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అడ్వాన్స్ డిప్లమా కంప్యూటర్ అప్లికేషన్స్, డెస్క్‌టాప్ పబ్లికేషన్స్, హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్ విభాగాలలో శిక్షణనిస్తున్నారు. వివరాలకు 99667 40353 నెంబర్‌లో సంప్రదించవచ్చునని వెల్లడించారు.

## అందరూ అమరావతికే!

జిల్లాకు చెందిన అధికారపార్టీ నాయకులు, అధికారులు, ప్రముఖులు చాలామంది ఈసారి దసరా పండుగను అమరావతిలో చేసుకోవాల్సి వచ్చింది. దసరా రోజే అమరావతి రాజధాని శంకుస్థాపన పెట్టుకోవడంతో వీళ్లందరికీ వెళ్లక తప్పలేదు. తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్, ఛైర్‌పర్సన్‌లు, కార్పొరేటర్‌లు, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ సంఘాల ఛైర్మెన్‌లతో పాటు జిల్లాలోని పలువురు అధికారులు, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో అమరావతికి వెళ్లారు. జిల్లాలోని 10నియోజకవర్గాల నుండి కూడా భారీగా వాహనాలను ఏర్పాటు చేసి కార్యకర్తలను అమరావతికి తీసుకెళ్లారు.

## అర్ధరాత్రి మంత్రి తనిఖీలు

నెల్లూరు బారాషాహీద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి పి.నారాయణ 15వ తేదీ అర్ధరాత్రి 12గంటలు దాటిన తర్వాత పరిశీలించారు. మంత్రితో పాటు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ మూర్తి, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 24వ తేదీ నుండి జరిగే రొట్టెల పండుగ ఏర్పాట్లు గురించి అధికారులతో చర్చించారు. పలు సూచనలు చేసారు. దర్గా ప్రాంగణంలోని స్వర్ణాల చెరువును పరిశీలించారు. నెల్లూరుకు ఎప్పుడు వచ్చినా అర్ధరాత్రే వస్తాడని ప్రతిపక్షాలు ఆయనకు చీకటిమంత్రిగా ముద్రవేసాయి. అది నిజమన్నట్లు మంత్రి అర్ధరాత్రి దర్గా వద్ద పర్యటన జరిపారు.

## క్రీడలలో విశ్వసాయి ప్రతిభ




నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కాలేజీ విద్యార్థిని వై.సాయిఆశ్రిత నవంబర్‌లో నల్గొండలో జరుగనున్న జాతీయ స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైంది. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా నారాయణపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలలో చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపికైంది. అలాగే పి.వి.రిషికిరెడ్డి జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో తన ప్రతిభను చాటుకున్నారు. ఈ విద్యార్థులను కళాశాల ఛైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ అభినందించారు.

## మాలధారణ భక్తుల మెగా రక్తదాన శిబిరం



శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి ఆధ్వర్యంలో మాలధారణ ధరించిన భక్తులు ఆదివారం రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి మాట్లాడుతూ మానవ సేవే మాధవసేవగా భావించి సామాజిక కార్యక్రమాల్లో సైతం రాజరాజేశ్వరి అమ్మవారి సేవాసమితి భాగస్వామ్యం కానుందన్నారు. ఈ ఏడాది జిల్లాలో డెంగీ ప్రబలడంతో, వీరిని ఆదుకోవాలనే సంకల్పంతో తొలిసారి రక్తదాన శిబిరాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి మోపూరు వెంకటశేషయ్య, సేవాసమితి సభ్యులు మొగరాల సురేష్, ప్రాణేష్, రవికుమార్, కోడూరు సుబ్బారావు, మంగు భాస్కర్, బండి మాలకొండయ్య, వంశీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి పై సాహిత్య సదస్సు

ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం, ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా ఈ నెల 24వ తేదీ సాయంత్రం 6గంటలకు నెల్లూరు టౌన్‌హాలులోని వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో సాహిత్య సదస్సు, కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు చిన్ని నారాయణరావు, కార్యదర్శి ఈతకోట సుబ్బారావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని కవులు, రచయితలు, సాహితీవేత్తలు ఎవరైనా పాల్గొనవచ్చునని, ఉత్తమ కవితలకు బహుమతులందజేయబడుతాయని వారు పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు పి.చెంచయ్య, శ్రీమతి శోభారాణి, చలంచర్ల భాస్కర్‌రెడ్డిలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, జిల్లాలోని కవులు, సాహితీవేత్తలు ఈ సభకు విచ్చేసి జయప్రదం చేయాలని వారు కోరారు.

## పోలీసులకు వ్యాసరచన పోటీలు



పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 16వ తేదీ నెల్లూరు పరేడ్‌గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ డా॥ గజరావు భూపాల్ సూచనల మేరకు ఏఆర్ ఏఎస్‌పి కె.సూరిబాబు ఆధ్వర్యంలో పోలీసులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రజలతో మమేకమయ్యే దిశగా పోలీసు ప్రస్థానం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచనను రెండు విభాగాలలో ఏఎస్‌ఐ లోపు ర్యాంకు కలిగిన పోలీసులకు, ఎస్సైలకు పరీక్షలు నిర్వహించినట్లు పోలీసు సంఘం అధ్యక్షులు మద్దిపాటి ప్రసాదరావు తెలిపారు. ఈ పోటీలకు ఇన్విజిలేటర్లుగా పోలీసు వ్యాస్ స్కూలు అధ్యాపకులు బి.దేవసహాయం, ఎస్.శ్రీనివాస్, టి.సాయిలావణ్య, ఏ.చంద్రశేఖర్‌లు వ్యవహరించారు. ఈ పోటీల్లో 62మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ చెంచురెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## విఐపిలదే హవా

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రుల సందర్భంగా విఐపిల గోల ఎక్కువైంది. గతంలోనూ దర్శనాల వద్ద విఐపి సంస్కృతి వున్నా అదంతగా పైకి కనిపించేది కాదు. దాదాపు 20ఏళ్ల ఆనం వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ శరన్నవరాత్రి ఉత్సవాలు జరిగాయి. ఎప్పుడూ రచ్చ కాలేదు. విఐపి దర్శనాలను చాలా వరకు తగ్గించే వాళ్లు. విఐపిలకు ప్రత్యేక సమయం కేటాయించేవాళ్లు. ఇప్పుడు తెలుగుదేశం అధికారంలో వుంది. ఆ పార్టీ స్థానిక కార్పొరేటర్లకు రాక రాక అవకాశం వచ్చింది. దీంతో తమ పరపతి ఉపయోగించారు. తమతో పరిచయాలున్న అందరికీ విఐపి దర్శన భాగ్యం కల్పించారు. దీంతో అసలు ప్రత్యేకదర్శనం టిక్కెట్ల అమ్మకం తగ్గిపోయి అమ్మవారి ఆదాయం బాగా పడిపోయిందని పూజారులు వాపోతున్నారు.

## బిసి కార్పొరేషన్ ఇ.డి బదిలీ

బిసి కార్పొరేషన్ ఇ.డి కోటేశ్వరరావును పశుసంవర్ధక శాఖకు బదిలీ చేశారు. ఆయన పశు సంవర్ధకశాఖ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి పన్నెండేళ్లు పూర్తి కావడంతో తిరిగి పశు సంవర్ధకశాఖకు బదిలీ అయ్యారు. 2003 అక్టోబర్ 15 నుంచి ఇప్పటివరకు వివిధ శాఖల్లో జిల్లా అధికారిగా ఆయన పని చేశారు. 2003 నుంచి 2009 వరకు వికలాంగుల సంక్షేమశాఖాధికారిగా, 2009 నుంచి బిసి కార్పొరేషన్ ఇ.డి.గా పని చేశారు.

### ఇన్‌ఛార్జ్ ఇ.డి గా సెట్నల్ సిఇవో...

బిసి కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఇ.డిగా సెట్నల్ సిఇఓ సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు. సైనిక సంక్షేమ అధికారి బాధ్యతలను కూడా ఆయన నిర్వర్తిస్తున్నారు.

## రైల్వేస్టేషన్లో నిఘా

రొట్టెల పండుగను పురస్కరించుకుని ఈ నెల 24వ తేదీ నుండి మూడురోజుల పాటు నెల్లూరు రైల్వేస్టేషన్లో 24గంటలు ప్రత్యేక బలగాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు స్టేషన్ సూపరింటెండెంట్ షాజహాన్ తెలిపారు. రైల్వే విభాగానికి సంబంధించి వివిధ విభాగాల అధికారులతో 17వ తేదీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాజహాన్ మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 27వరకు రైల్వేస్టేషన్ ప్రయాణీకులతో కిక్కిరిసి వుంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న సిసి కెమెరాలే కాకుండా అవసరం ఉన్న చోట్ల అదనపు సిసి కెమెరాలను ఏర్పాటు చేసి బందోబస్తును పర్యవేక్షిస్తామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా స్టేషన్లో, స్టేషన్ బయట తాగునీరుకు, వైద్యానికి సంబంధించి ప్రత్యేక డాక్టర్ల పర్యవేక్షణ ఉండే విధంగా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్లో ఉన్న లిఫ్ట్, ఎస్కలేటర్ ఎల్లవేళలా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ సతీష్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### • టిటిడి కల్యాణ మండపాలను

# ఆధునీకరిస్తాం

### - టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి



రాష్ట్రంలోని 13జిల్లా కేంద్రాల్లో ఉన్న టిటిడి కల్యాణ మండపాలను ఆధునీకరిస్తున్నట్లు టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ రాత్రి నెల్లూరు టిటిడి కల్యాణ మండపంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నెల్లూరులో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, ప్రకాశం జిల్లా ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డిలు కల్యాణ మండపాలను ఆధునీకరించేందుకు ముందుకు వచ్చారన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో నెల్లూరు ప్రజలకు గుర్తుండిపోయేలా కల్యాణ మండపాన్ని తీర్చిదిద్దుతామన్నారు. టిటిడి కల్యాణ మండపం ప్రాంగణంలో దేవస్థానాన్ని మాత్రమే టిటిడి ఆధ్వర్యంలో నిర్మించనున్నట్లు తెలిపారు. నవ్యాంధ్ర రాజధానికి సమీపంలోని అనంతవరం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి టిటిడి నిర్వహణ బాధ్యతలను తీసుకుందన్నారు. గుంటూరు, రాజమండ్రిలలో అత్యద్భుతంగా శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాలను నిర్మించనున్నట్లు తెలిపారు. కృష్ణా తీరంలో 15ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాని కోరామని, అక్కడ టిటిడి దేవస్థానాన్ని నిర్మించి ఆథ్యాత్మిక ప్రాంగణాలను రూపొందిస్తామన్నారు. త్వరలో ఢిల్లీలో శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య రైతులకు రుణాలివ్వాలి



- మెట్టుకూరు

సామాన్య రైతుకు రుణాలు మంజూరు చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సూచించారు. ఈ నెల 16వ తేదీ నెల్లూరు డిసిసిబి కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసిసిబి పరిధిలోని బ్యాంకుల్లో డిపాజిట్లు సేకరణను పెంచాలని దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దన్నారు. భూములున్న వారికి ఎస్టీ, ఇతర రుణాలను ఎకరాకు రూ.లక్ష వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత ఆరు నెలల్లో ఇప్పటివరకు బ్యాంకు ద్వారా రూ. 50కోట్లు నూతన రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. బ్యాంకు పరిధిలో వున్న సిబ్బంది ఖాళీలను ఐబిపిఎస్ పరీక్ష ద్వారా రిక్రూట్‌మెంట్ చేస్తామన్నారు. స్వల్ప కాలిక రుణాలు రూ. 8కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ. 8. 5కోట్లు, ఎస్టీ, ఇతర రుణాలు రూ. 34కోట్లు ఇచ్చినట్లు వివరించారు. ప్రస్తుతమున్న రూ. 148కోట్ల డిపాజిట్లను రూ. 200కోట్లు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు, బ్యాంకు సిఇవో రమణారెడ్డి, డిజిఎంలు సరిత, ఉషారాణి పాల్గొన్నారు.

### అవయవదాత కుటుంబానికి

# కాకాణి చేయూత



నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం ఈదగాలికి చెందిన అవయవ దాత అడపాల మస్తానయ్య కుటుంబానికి వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో మస్తానయ్య బ్రెయిన్‌డెడ్ కాగా నలుగురికి అవయవదానం చేసిన విషయం విదితమే. మస్తానయ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎమ్మెల్యే తన సొంత నిధుల నుంచి నగదు అందజేశారు. నెల్లూరు పొదలకూరురోడ్డులోని ఎమ్మెల్యే నివాసంలో మస్తానయ్య తల్లి పోలమ్మ, పిల్లలు రిత్విక్, మైథిలికి ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ మస్తానయ్య తన అవయవాలను దానం చేసి నలుగురిని చిరంజీవులు చేసారని కొనియాడారు. ఈ కుటుంబానికి రాబోయే రోజుల్లో కూడా తనవంతు సాయం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు వెంకటశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్‌లకు దరఖాస్తులు

జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా మరియు మండల స్థాయి ప్రతినిధులు కొత్త అక్రిడిటేషన్‌ల కోసం ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మరియు అక్రిడిటేషన్ కమిటీ ఛైర్మెన్ శ్రీమతి యం.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు 10పత్రికాప్రకటనల కత్తిరింపులు, పత్రిక యాజమాన్యం గుర్తింపు కార్డు, 2పాస్‌పోర్టు ఫోటోలు, యాజమాన్య నియామక ఉత్తర్వులు జత చేయాలని ఆమె కోరారు.

# శ్రీసిటీలో తైవాన్ ప్రతినిధులు



తైవాన్ దేశానికి చెందిన ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీల నుండి 16మంది సభ్యుల ఉన్నత స్థాయి బృందం శ్రీసిటీలో పర్యటించింది. ఆ దేశ విదేశీ వాణిజ్య అభివృద్ధి మండలి యొక్క డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మెంగ్ చూయన్‌లీ ఆధ్వర్యంలో విచ్చేసిన ఈ బృందానికి శ్రీసిటీ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ రాగిణి పీటర్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ఏర్పరచిన అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల గురించి, వివిధ పారిశ్రామిక యూనిట్ల గురించి, శ్రీసిటీ సాధించిన ప్రగతి గురించి వివరించారు. తరువాత, వారంతా శ్రీసిటీలోని వివిధ ప్రదేశాల్లో పర్యటించారు. మన దేశంలో తమ పెట్టుబడులకు, వ్యాపార అభివృద్ధికి గల అవకాశాలను పరిశీలించటానికి విచ్చేసిన ఈ బృందం, శ్రీసిటీ ప్రత్యేకతలను, నెలకొల్పబడిన మౌలిక వసతులను అత్యంత ఆసక్తితో గమనించారు.

శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ తైవాన్ ఆటోమొబైల్ కంపెనీల ప్రతినిధుల బృందం శ్రీసిటీని సందర్శించడం, జరుగుతున్న అభివృద్ధిని ఆసక్తితో గమనించటం, అభినందించటం తమకు సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. వ్యాపార పెట్టుబడులకు, ముఖ్యంగా ఆటోమొబైల్ రంగంలో పెట్టుబడులకు శ్రీసిటీ అనువుగా వున్నందున ప్రపంచ ప్రఖ్యాత ఇసుజు కార్ల కంపెనీ, అనేక ఆటో విడి భాగాల తయారీ కంపెనీలు ఇప్పటికే తమ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాయని చెబుతూ ఆటోమొబైల్ పరిశ్రమలకు శ్రీసిటీ అతి పెద్ద కేంద్రంగా ఎదగనున్నదనటానికి తైవాన్ బృందం పర్యటన ఒక సంకేతమన్నారు. తైవాన్ దేశానికి చెందిన ప్రముఖ మొబైల్ కంపెనీ అతి తక్కువ సమయంలో ఉత్పత్తి ప్రారంభించటంతో, ఆ దేశానికి చెందిన పలు వ్యాపార సంస్థలు తమ వ్యాపార పెట్టుబడులకు శ్రీసిటీనే గమ్యంగా ఎంచుకుంటున్నాయని ఆయన అన్నారు. వ్యాపారాభివృద్ధికి అవసరమైన అన్ని వసతులను, చక్కని సదుపాయాలను, పరిశ్రమలకు కావలసిన విధంగా ఏర్పరచినందుకు శ్రీసిటీ యాజమాన్యాన్ని మెంగ్ చూయన్ లీ అభినందించారు. తైవాన్ నుండి ఆటోమొబైల్ పరిశ్రమలు శ్రీసిటీకి రావడానికి తమ సహకారం అందిస్తామని ఆమె అన్నారు.



# మంత్రిగారి తల్లిచే నీళ్లు-మట్టి

రాష్ట్రంలో సిఎంను మొదలుకొని పంచాయితీ సర్పంచ్ వరకు అధికారపార్టీ నాయకులందరూ కూడా అమరావతి రాజధాని కోసం తమ తమ గ్రామాల నుండి మట్టి – నీళ్లు పంపించడం జరిగింది. ప్రతి గ్రామంలోనూ ఇలా సేకరించిన మట్టి – నీళ్లతో భారీగా పూరేగింపులు, పూజలు నిర్వహించారు. మంత్రి పి.నారాయణ రాజధాని శంకుస్థాపన ఏర్పాట్లలో బిజీగా వుండడంతో ఆయన స్వగ్రామం టిపి గూడూరు పంచాయితీ పరిధిలో ఇటీవల మట్టి – నీళ్లు తీసే పనిని ఆయన తల్లి శ్రీమతి సుబ్బమ్మ చేతులమీదుగా జరిపించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# క్యాన్సర్‌ను జయిద్దాం

### - కలెక్టర్ యం.జానకి




ప్రతి ఎనిమిది మంది మహిళల్లో ఒకరికి రొమ్ము క్యాన్సర్ సోకుతుండడం విచారకరమని నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి క్యాన్సర్ హాస్పిటల్ వారు భార్గవ్ హెల్త్ ప్లస్ వారి సహకారంతో నెల్లూరులో 'పింక్ రిబ్బన్ వాక్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల్లో రొమ్ము క్యాన్సర్‌ని గురించి అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ యం.జానకి, జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జానకి మాట్లాడుతూ మహిళలే స్వయం పరీక్షల ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించే అవకాశం వుందన్నారు. వ్యాధి ముదరక ముందే తగిన చికిత్స చేసుకోవడం ద్వారా తమని తాము కాపాడుకోవచ్చున్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా ఈ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించుకుని ఇతరులకు ఈ విషయంలో అవగాహన కల్పించాలన్నారు. ఏసి సుబ్బారెడ్డి స్టేడియం నుంచి పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ వరకు సాగిన పింక్ రిబ్బన్ వాక్ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ సిఎంఓ డా॥ టి.లక్ష్మి, సర్జికల్ అంకాలజిస్ట్ డా॥ యం.నాగేశ్వరరావు, రేడియేషన్ అంకాలజిస్ట్ డా॥ గీతా ఉషశ్రీ, సర్జన్ డా॥ జె.వి.రామమోహన్, సోనాలిజిస్ట్ డా॥ వి.సమత, సిబ్బంది పాల్గొన్నారు. భార్గవ్ హెల్త్‌ప్లస్ నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యసమన్వయకర్తగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నారాయణ హాస్పిటల్ విజయమోహన్‌రెడ్డి, ఏసి సుబ్బారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ కృష్ణమూర్తి శాస్త్రి, కాలేజీ ప్రొఫెసర్లు, మెడికల్ కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, వాకర్స్ సభ్యులు, భగవాన్ మహావీర్ జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ నడక "తల్వాకర్స్" జిమ్ము వారి ఫిట్‌నెస్ డ్యాన్సుతో ముగిసింది.

# అలరించిన కోటి పాటకచ్చేరి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, సూళ్లూరుపేటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ చెంగాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు కోటి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అత్యద్భుతంగా పాట కచ్చేరీ నిర్వహించారు. 'బోల్ బేబీ బోల్' చిన్నారులు ఈ పాటకచ్చేరీలో పాల్గొన్నారు. కోటి కుటుంబానికి చెంగాళ పరమేశ్వరి అమ్మవారు ఇష్టదైవం కూడా. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు ఇసనాక హర్షవర్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## జాతీయ స్థాయి హాకీ క్రీడలకు
# ఎల్ఏపి విద్యార్థి మౌనిష్



మౌనిష్‌ను అభినందిస్తున్న ఎల్ఏపి కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి

గూడూరు సమీపానున్న శారదానగర్‌లోని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఇటీవల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మౌనిష్‌ను అభినందించారు. కర్నూలులో ఈనెల 13 నుంచి 15వతేదీ వరకు రాష్ట్ర స్థాయిలో జరిగిన 61వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికల్లో మౌనిష్ విశేష ప్రతిభ కనపరచారని చెప్పారు. దీంతో రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించుకొని ఈ ఏడాది డిసెంబర్ నెలలో రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

ఈ సందర్భంగా మౌనిష్‌ను హాకీ కోచ్ గోవిందరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## కనుమూరు సత్యనారాయణరెడ్డి మెమోరియల్
# 61వ ఏపి స్కూల్స్ గేమ్స్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, ప్రక్కన సబ్‌కలెక్టర్ గిరీషా, హరిచంద్రారెడ్డి

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆదివారం కనుమూరు సత్యనారాయణరెడ్డి మెమోరియల్ 61వ ఏపి స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ టోర్నమెంట్ కం సెలక్షన్స్ పోటీలను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ గిరీషా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల పోటీతత్వం, మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ మంచి ప్రతిభ కనబరిస్తే ఉన్నతస్థాయికి చేరవచ్చని సూచించారు. హాకీ క్రీడలో రాష్ట్రంలోనే గూడూరుకు ప్రత్యేకమైన స్థానం ఉందని, ఇక్కడి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా ఎదిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిఇవో వెంకయ్య, ఆర్‌జెడి వై.పరందామయ్య, ప్రాంతీయ ఇంటర్ విద్యాశాఖాధికారి జాకబ్, కనుమూరు హరిచంద్రారెడ్డి, కె.మునిగిరీష్, రాష్ట్ర పరిశీలకులు సుబ్బారావు, వేణుగోపాల్‌రెడ్డి, హాకీ అసోసియేషన్ ప్రతినిధి గోవిందరాజు, పీడీలు, పిఇటిలు, మేనేజర్లు, కోచ్‌లు, 13జిల్లాల నుంచి క్రీడాకారిణిలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజధానికి 'నీరు-మట్టి'

నూతన రాజధాని అమరావతికి మన నీరు – మన మట్టి కలశాలను వైభవోపేతంగా ఊరేగించి మేళతాళాల మధ్య ర్యాలీ నిర్వహించి ప్రత్యేక వాహనంలో సోమవారం ఉదయం తరలించారు. సబ్‌కలెక్టర్ గిరీషా సమక్షంలో తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మ ఆధ్వర్యాన పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం, గూడూరు పట్టణ, గ్రామీణ, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన 200 నీరు-మట్టి కలశాలను సంప్రదాయబద్ధంగా తరలించే ఏర్పాటు చేశారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి బాణాసంచా మోతల మధ్య ఊరేగింపుగా ప్రత్యేక వాహనంలో గూడూరు సమీపంలోని జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గ ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలతో కలశాలను అధికారులు తరలించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి జ్యోత్స్నలత, డిఎస్పీ బి.శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, చిల్లకూరు తహశీల్దార్ ప్రసాద్, ఎంపిడివో భవాని, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్ పనులు చేపట్టండి

గూడూరు పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ వంతెనకు సంబంధించి అసంపూర్తి పనులు చేపట్టేలా చూడాలని సబ్‌కలెక్టర్ గిరిషాకు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాధాజ్యోత్స్నలత కోరారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పలువురు నాయకులతో కలసి సబ్‌కలెక్టర్‌ను కలసి నియోజకవర్గంలోని సమస్యలు విన్నవించారు. ఈ కార్యక్రమంలో గూడూరు, చిల్లకూరు తెలుగుదేశంపార్టీ నాయకులు ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, బొల్లినేని కోటేశ్వరరావు, పడిమాల శ్రీహరి, గోను విక్రం తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం నిందితుల అరెస్ట్ - డిఎస్పీ శ్రీనివాస్

గూడూరు సబ్‌డివిజన్ పరిధిలోని రాపూరు, నాయుడుపేట ప్రాంతాల్లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా వున్న 81 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. గూడూరు డిఎస్పీ కార్యాలయంలో ఇటీవల విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. రాపూరు మండలం తెగచర్ల-రాంకూరు వెళ్ళే మార్గంలో అక్రమంగా రవాణాకు సిద్ధంగా వున్నాయన్న సమాచారాన్ని అందుకుని ఎస్పీ గజరావు భూపాల్ ఆదేశాల మేరకు వెంకటగిరి సిఐ శ్రీనివాసరావు, సిబ్బంది శుక్రవారం వేకువ జామున దాడులు నిర్వహించారు. వీటి విలువ షుమారు 3లక్షలు వుంటుందన్నారు. కాగా నాయుడుపేట మండలం


వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ శ్రీనివాస్

స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

అరవపెరిమిడికి చెందిన అశోక్‌కుమార్‌రెడ్డి ఎర్రచందనం దుంగలను సేకరించి చెన్నైకు తరలించేందుకు దుంగలను సిద్ధం చేశాడని సమాచారం అందడంతో దాడులు చేసి నిందితుడితో పాటు రూ.4లక్షల విలువైన ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకుని వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి, సూళ్లూరుపేట సిఐలు శ్రీనివాసరావు, రత్నయ్య, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేవి శరన్నవరాత్రి వేడుకలు

గూడూరు పట్టణంలో దేవి శరన్నవ రాత్రి వేడుకల్లో భాగంగా పలు ఆలయాల్లో అమ్మవార్లు విశేష అలంకరణల్లో భక్తులకు దర్శన మిచ్చారు. పట్టణంలోని రాజరాజేశ్వరి దేవి మోహినిగా, కన్యకా పరమేశ్వరి దేవి వనలక్ష్మిగా, మూల స్థానేశ్వరస్వామి ఆల యంలో పార్వతిదేవి దుర్గాదేవిగా, సాయి సత్సంగంలో త్రిపుర సుందరిదేవి సరస్వతి మాత అలంకారాల్లో కొలువు దీరారు. ధర్మరాజుల గుడి, మహాలక్ష్మమ్మ, నారాయణమ్మ ఆలయాల్లోనూ అమ్మవార్లకు సరస్వతి అలంకరణ చేశారు. పండితులు వేదమంత్రోచ్ఛారణలతో వైభవంగా ప్రత్యేక పూజలు జరిపారు.

# వైకాపా నాయకుల దీక్షలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

ప్రత్యేకహోదా కోరుతూ సాగుతున్న దీక్షలను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిర్వహించారు. గూడూరు గడియారపు స్థంభం కూడలి వద్ద కోట, వాకాడు మండలాల వైకాపా నాయకులు రిలే దీక్షలు చేశారు. ఈ దీక్షలో నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, పద్మ నాభరెడ్డి, మధుయాదవ్, రాజగోపాల్‌రెడ్డి, వాటంబేడు శివకుమార్, నాశిన నాగులు, స్థానిక వైకాపా కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతికి శ్రీకాళహస్తి "మట్టి - నీరు"

చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో "మన అమరావతి – మన నీరు – మన మట్టి" కార్యక్రమంలో భాగంగా లోబావిలోని మట్టిని, స్వర్ణముఖినదిలోని నీరును, లోబావిలో ఉన్న పుట్టమట్టిని సేకరించుకొని తలమీద పెట్టుకొని ట్రస్టుబోర్డు ఛైర్మన్ పోతుగుంట గురవయ్యనాయుడు, సభ్యులు చంద్ర, కంద్రిగ ఉమ, ప్రమీలమ్మ, కాసరం రమేష్, జయగోపాల్, గుర్రప్పశెట్టి, ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబలు ఆలయం చుట్టూ రెండు ప్రదక్షిణలు చేశారు. తర్వాత తొట్టంబేడు మండల ప్రజలు కూడా అదేవిధంగా మట్టి – నీరును సేకరించి ఆలయంలోనికి తీసుకొచ్చి ఛైర్మన్, సభ్యులకు, కార్యనిర్వహణాధికారికి అందజేశారు. అలాగే శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో 35 వార్డు సభ్యుల ఆధ్వర్యంలో రాష్ట్ర అటవీశాఖమంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సమక్షంలో మున్సిపల్ కార్యాలయంలో "నీరు – పుట్టమట్టి" కి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయంలోనికి వెళ్ళి రెండు ప్రదక్షిణలు చేసి కార్యనిర్వహణాధికారికి, ఛైర్మన్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పేట రాధారెడ్డి, వైస్ ఛైర్మన్ పార్థసారధి, కౌన్సిలర్లు సుప్రజ, లత, విజయకుమార్, అన్ని వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ కళాశాల స్కిట్ కళాశాల నందు అందరు తీసుకొచ్చిన 'మన నీరు – మన మట్టి'కి పూజలు నిర్వహించి అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి అందచేశారు. మంత్రి జెండా ఊపి ప్రత్యేక వాహనంలో నీరు-మట్టిని అమరావతికి తీసుకెళ్ళారు. వివిధ చెరువుల మట్టి, పొలాల మట్టి, పుట్టమట్టి, చెరువు నీరు, పొలాల్లో ఉన్న నీరును తీసుకొచ్చారు.

ఈ కార్యక్రమంలో చిత్తూరుజిల్లా కలెక్టర్ సిద్ధార్ధ జైన్, ట్రస్టు బోర్డు ఛైర్మన్ పోతుగుంట గురవయ్యనాయుడు, సభ్యులు కంద్రిగ ఉమ, ప్రమీలమ్మ, చంద్ర, కాసరం రమేష్, గుర్రప్పశెట్టి, లోకనాథం నాయుడు, తదితరులు ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ, పి.ఆర్ఓ సుదర్శన్, ఎపిఆర్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తి న్యూస్

## అమృత్ పథకంతో అమృతమయం

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన "అమృత్" పట్టణాల జాబితాలోకి చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పట్టణాన్ని కేంద్రపట్టణాభివృద్ధి శాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేర్చిన సందర్భంగా శ్రీకాళహస్తి బీజేపీ పార్టీ నాయకుడు కోలా ఆనంద్, రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ మెంబరు గరికపాటి రమేష్‌బాబుల ఆధ్వర్యంలో అన్ని మండలాల నాయకులు కలిసి అత్యంత వైభవంగా ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడుకు శ్రీకాళహస్తి పట్టణం మీద ఉన్న అభిమానంతో "అమృత్"లో చేర్చారని ఆనందం వ్యక్తం చేశారు. అమృత్ పథకంలో శ్రీకాళహస్తి పట్టణం చేరడంతో, సంవత్సరానికి వందకోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అమృత పథకంలో ఉద్యానవనాల అభివృద్ధి, భూగర్భ మురుగు ప్రవాహ వ్యవస్థ, స్వచ్ఛమైన త్రాగు నీరు, విశాలమైన రోడ్లు, కొత్త త్రాగునీటి వనరుల కల్పన, భూగర్భ జలాల పరిరక్షణ, వేలకొలది పక్కాగృహాలు, పిల్లల కోసం రిక్రియేషన్ సెంటర్లు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థికాభివృద్ధికై మీ ప్రయత్నాలు సరిగా నెరవేరక పోవచ్చును. ఆదాయం సామాన్యం. ప్రయాణ ఖర్చులు, శుభకార్య ఖర్చులు పెరుగుతాయి. విలువైన వస్తువులు, నగదు జాగ్రత్త పరుచుకొనండి. సభలు, సమావేశాలలో జాగ్రత్తగా వ్యవహరించండి. అప్పుడప్పుడు పనుల వత్తిడికి గాను టెన్షన్ పడుతారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. లోన్లు మంజూరు కాగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆస్తి వ్యవహారాలు, ఆర్థిక వ్యవహారాలలో తొందర పడి నిర్ణయాలు చేయవద్దు. దూర ప్రయాణాలు, శుభ కార్యాల వల్ల ఖర్చులుంటాయి. దైవక్షేత్ర సందర్శన ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరుకు తాయి. నిర్మాణ పనులు, కాంట్రాక్టు పనులు నిదానంగా జరుగుతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

చేపట్టిన పనులు సానుకూలం కాగలవు. పదవులు, సభ్యత్వాలు చేపట్టుతారు. దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుతాయి. ఉద్యోగులకు పనుల వత్తిడి ఎక్కువుగా వుంటుంది. దూరప్రయాణాలు శుభకార్యాల ఖర్చులు పెరుగుతాయి. గృహోపకరణాలు విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. వృత్తి వ్యాపారాలు వేగంగా వృద్ధి చెందుతాయి. షేర్లు లాభిస్తాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. మంచి అనుభవం సంపాదిస్తారు. శుభకార్య ఖర్చులు, ప్రయాణ ఖర్చులు పెరుగుతాయి. అనుకున్న పనులను, కార్యక్ర మాలను తొందర తొందరగా నిర్వహించినా సక్రమంగా జరుగుతాయి. షేర్లు మీద లాభాలుంటాయి. శుభకార్య ములు నిర్ణయం కాగలవు. రావలసిన బాకీలు కొంత వరకు అందుతాయి. నిరుద్యోగులకు అవకాశాలుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వాణిజ్యాలలో మంచి అవకాశాలు లభిస్తాయి. ఆదాయం బాగుంటుంది. కోర్టు వ్యవహారాలలో అను కూలత శుభకార్యాలలో పాల్గొనడం, పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు అవకాశాలు దొరకడం జరుగు తుంది. సొంత పనులకు బంధుమిత్రులు సహకరిస్తారు. ఖర్చులు అదనంగా వుండినా ఇబ్బంది పడరు. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక లావాదేవీలు, క్రయవిక్రయాలలో తొందర పడవద్దు. పనులు జరిపేటప్పుడు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఖర్చులు అదనంగా ఉంటాయి. వృత్తి వ్యాపా రాలలో కొన్ని అవకాశాలు చేజారిపోయినా ఆదాయము అసంతృప్తికరంగా ఉంటుంది. ఉద్యోగులకు పనిభారం, వత్తిడి, పర్యవేక్షణలు పెరుగుతాయి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. అనుకోని ప్రయాణాలుండవచ్చును.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 23.10.2015 నుండి**
**తేది. 29.10.2015 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, సింహంలో కుజ గురు శుక్రులు, కన్యలో బుధ రాహువులు, తులలో రవి, వృశ్చికంలో శని, కుంభ మీన మేష వృషభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

- తేది 23.10.2015 రాత్రి గంట 9.33 నుండి 11.45లోగా వివాహ, గృహ ప్రవేశములు.
- తేది 25.10.2015 ఆదివారం పగలు గంట 10.0 నుండి గంట 12.0లోగా వివాహ వ్యాపార ఉపనయన, కేశ ఖండన ముహూర్తములు.

### ఆశ్వయుజ మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 23 | శుక్ర | ఏకాదశి | రా॥ గం.3.14వ॥ |
| తేది. 24 | శని | ద్వాదశి | రా॥ గం.1.0వ॥ |
| తేది. 25 | ఆది | త్రయోదశి | రా॥ గం.10.35వ॥ |
| తేది. 26 | సోమ | చతుర్దశి | రా॥ గం.8.04వ॥ |
| తేది. 27 | మంగళ | పూర్ణిమ | సా॥ గం.5.50వ॥ |

### ఆశ్వయుజ మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 28 | బుధ | పాడ్యమి | సా॥ గం.3.38వ॥ |
| తేది. 29 | గురు | విదియ | మ॥ గం.1.38వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపార వర్గాలకు కొద్ది ఒడిదుడుకులుండినా ఆదాయం సంతృప్తికరం. వృత్తి జీవనంగలవారు ఆర్ధి కంగా పుంజుకుంటారు. పలుకుబడితో అనుకున్న పనులు సాధించుకొంటారు. దైవకార్యాలకు, శుభకార్యాలకు ఖర్చులు తప్పనిసరి కాగలవు. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. ఉద్యోగార్థులకు చిన్న అవకాశాలు దొరక గలవు. ఆరోగ్యం మీకు ఫరవాలేదు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

తలపెట్టిన పనులు నిదానంగా జరగడం వల్ల విసుగు శ్రమ, టెన్షన్ ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో పెరుగుదల ఉండి ఆదాయం వృద్ధి చెందుతుంది. బంధుమిత్రులకు సహాయ సహకారాలు అందిస్తారు. శుభకార్యాలు నిర్ణయం చేయడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. మీ వృద్ధిని చూచి విమర్శించేవాళ్ళుంటారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబంలో చిన్నచిన్న వ్యవహార సమస్యలుం టాయి. కుటుంబ ఖర్చులు, శుభకార్యాల ఖర్చులు, ప్రయాణ ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు లభించి, ఆదాయం పెరుగుతుంది. ఉద్యో గులు తమ విధి నిర్వహణలో సమస్యలు రాకుండా చూచు కొనండి. చేపట్టిన పనులను పలుకుబడి, డబ్బుతో జరుపు కొంటారు. పొదుపు పథకాలపై దృష్టి పెడతారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

మీ వ్యాపార పథకాలు ఫలించి లాభాలు సమకూర్చు కొంటారు. వృత్తి జీవనం కలిగినవారికి ఆర్థికంగా బాగుంటుంది. వస్తు వాహన రిపేర్లు, ఖర్చులు అదనంగా ఉంటాయి. మీ శుభకార్య ప్రయత్నాలు, కొత్త వ్యాపార ప్రారంభయత్నాలు ఫలించగలవు. ఉద్యోగులకు స్థాన మార్పులు ఉండవచ్చును. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించ గలవు. షేర్లు కొంత నిరుత్సాహాన్ని కలిగిస్తాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపారాలు, వృత్తి జీవనాలు లాభసాటిగా సాగు తాయి. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులను సమర్ధవంతంగా జరుపుకొంటారు. బంధువులు సమ స్యలు సృష్టించి, మిమ్మల్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. ముఖ్య పత్రాలు, డబ్బును జాగ్రత్త పరచుకొనండి. ఉద్యోగులకు ప్రోత్సాహకాలుండినా పనిభారం పెరగడం, అధికారుల అజమాయిషీ ఎక్కువగా ఉండవచ్చును.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉంటాయి. శుభ కార్యాల ఖర్చులు ప్రయాణ ఖర్చులు పెరుగుతాయి. పలుకుబడి పట్టుదలతో అనుకున్న పనులు జరుపు కొంటారు. స్థిరాస్తుల లావాదేవీలందు తొందర పడవద్దు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. బంధుమిత్రులతో జాగ్రత్తగా మెలగండి. ఉద్యోగార్థులకు అవకాశాలు ఆలస్యం కావచ్చును. కుటుంబసౌఖ్యముంటుంది.

# సింగపూర్ ప్రధానికి అమరావతి పిచ్చి

శ్రీను గల్పిక

విజయవాడలో కృష్ణా నదీ తీరాన నవ్యాంధ్ర ముఖ్యమంత్రి, హైటెక్ రత్న చంద్రబాబునాయుడు కార్యాలయం. అమరావతి రాజధాని శంకుస్థాపన ఏర్పాట్లపై మంత్రులు పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమ, నిమ్మకాయల చినరాజప్ప, కె.ఇ.కృష్ణ మూర్తిలతో మాట్లాడుతున్నారు. సార్, శంకుస్థాపనకు ఆ జగన్ రానన్నాడు. ఆహ్వానం కూడా పంపొద్దని చెప్పాడని నిమ్మకాయల చెప్పాడు. వెరీగుడ్, నెత్తిన పాలు పోసాడు. ఒక ఇన్విటేషన్ మిగిలి నట్లే. ఇంకెవరన్నా రానని చెప్పారా అని చంద్రబాబు అడిగాడు. పవన్ కల్యాణ్ షూటింగ్ కోసం గుజరాత్ వెళ్తున్నాడట, ఉండనన్నాడని చింతకాయల అయ్యన్న పాత్రుడు చెప్పాడు. గుడ్‌న్యూస్... పవన్ రాకపోవడమే మంచిది. ఆయనొచ్చాడంటే జనం మనల్ని మరచిపోయి ఆయన వెంట పడతారని చంద్రబాబు అని... ఆహ్వాన పత్రాలు ఎలా ప్లాన్ చేద్దామని అడిగాడు. మన దేశంలో వున్న వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులకు కొరియర్‌ల ద్వారా, పోస్ట్ ద్వారా ఆహ్వానపత్రికలు పంపుదామని నారాయణ ప్రతిపాదించాడు. పోస్ట్ ద్వారా అయితే శంకుస్థాపన తర్వాత చేరుతాయేమో అని చంద్రబాబు సందేహం వెలిబుచ్చాడు. దానికి నారా యణ... ఇన్విటేషన్ చేరిందా లేదా అన్నది ముఖ్యం కాని, ఎప్పుడు చేరితేనేం అని బదులిచ్చాడు. అందుకు చంద్రబాబు... ఓకే, అలాగే చేయండి. అయితే సింగ పూర్, జపాన్, చైనా, అమెరికా, జర్మనీ, దుబాయ్, మలేషియా, ఇండోనేషియా, థాయ్‌లాండ్, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల అధినేతలకు మాత్రం మీరు స్వయంగా విమానాలేసుకుని వెళ్లి ఆహ్వానాలివ్వండి. మనం సాదా సీదాగా ఈ శంకుస్థాపన మహోత్సవం చేస్తున్నామని, అందరూ తప్పకుండా రావాలని నా మాటగా చెప్పండి. మంత్రులంతా తలా ఒక అద్దె విమానం మాట్లాడుకుని తలా ఒక దేశం పోండని చంద్రబాబు ఆదేశించాడు. అంతలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అక్కడకు వచ్చాడు. సార్, ప్రధాన మంత్రి కార్యాలయం నుండి లెటర్ వచ్చింది. శంకు స్థాపనకు మనం దుబారా చేస్తున్నామంట... వీటి వివరాలు ఇవ్వమని లేఖలో అడిగారని చెప్పాడు. చంద్రబాబు వెంటనే... కేంద్రానికి మీరూ ఓ లేఖ వ్రాయండి. చాలా సింపుల్‌గా శంకుస్థాపన చేస్తు న్నామని, కేవలం వంద విమానాలు మాత్రమే వస్తున్నాయని, లక్షమందికి మాత్రమే పంచభక్ష పరమాణ్ణాలతో కూడిన విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని, ఓ 20 హెలికాప్టర్‌లు మాత్రమే వివిపిలను చేరవేస్తాయని, 10వేల వాహనాలను మాత్రమే సభా ప్రాంగణానికి అనుమతిస్తున్నామని, ఈ పేద రాష్ట్రం జరుపుకునే రాజధాని శంకుస్థాపన ఖర్చుల కోసం కనీసం 200 కోట్లన్నా మంజూరు చేయమని కోరుతూ పిఎంఓకు లేఖ వ్రాయండని ఆదేశిం చాడు. కృష్ణారావు అలాగే వ్రాస్తానంటూ అక్కడ నుండి వెళ్లిపోయాడు.

★★★★★

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యా లయం. నరేంద్ర మోడీ, ఆయన ఎదురుగా రాజ్‌నాథ్‌సింగ్, వెంకయ్యనాయుడులు కూర్చుని వున్నారు. అప్పుడే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి వచ్చిన లెటర్‌ను తీసుకుని పిఎం సెక్రటరీ లోపలకు వచ్చాడు. మోడీ లెటర్ ఓపెన్ చేసాడు. అది తెలుగులో వ్రాసి వుంది. వెంకయ్యాజీ, ఈ లెటర్ తెలుగులో వుంది, ఏముందో చదివి చెప్పడంటూ వెంకయ్యనాయుడుకు ఇచ్చాడు. వెంకయ్య మొత్తం చదివాడు. మనం రాజధాని ఖర్చుల వివరాలడిగాం కదా, వాళ్లు వివరాలు పంపించారు. విమానాలు, హెలికాప్టర్‌లు, లక్ష మందికి భోజనాలు... చాలా సింపుల్‌గా శంకు స్థాపన చేస్తున్నార్సార్, పెద్ద ఖర్చు కావడం లేదు. మనల్ని ఖర్చు క్రింద 200కోట్లు అడిగారు. ఇచ్చేద్దాం. ఇంత సింపుల్‌గా రాజధానికి శంకుస్థాపన చేయడం నేనింత వరకు చూడలేదు. ఎక్కడా హంగూ ఆర్భాటం వుండ కూడదన్న మన ఆశయా లను చంద్రబాబు తూచ తప్పకుండా పాటిస్తున్నాడ్సార్ అని వెంకయ్య చెప్పాడు. అలాగైతే ఓకే... శంకుస్థాపనకు పోదాం అంటూ మోడీ లేచాడు.

★★★★★

అక్టోబర్ 22వ తేదీ విజయదశమి... అమరావతి రాజధాని శంకుస్థాపన ప్రాంగణం. భారీ హంగామాగా వుంది. పెద్దఎత్తున తోరణాలు, ఫ్లెక్సీలు కట్టి వున్నారు. ప్రజలు భారీగా తరలివచ్చారు. శంకుస్థాపన వేదిక వద్ద అమెరికా అధ్య క్షుడు బరాక్ ఒబామా, రష్యా అధ్యక్షుడు పుతిన్, జపాన్ ప్రధాని షింజోఅబె, సింగపూర్ అధ్యక్షుడు లీ, జర్మనీ ఛాన్సలర్ మెర్కెల్, మలేషియా ప్రధాని నజీబ్ రజాక్, థాయ్‌లాండ్ ప్రధాని ప్రయూత్ చాన్-ఓ-చా లు కూర్చుని వున్నారు. అప్పుడే నరేంద్ర మోడీ కూడా వచ్చాడు. వీరంతా కూడా అక్కడ జరుగుతున్న ఆర్భాటాన్ని చూస్తున్నారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, డప్పులు, సాంస్కృతిక సంబరాలు, బాణాసంచా మోతలు... అక్కడంతా పండుగ వాతావరణం నెల కొంది. ఆ వాతావరణం చూస్తుంటే విదేశీ ప్రతినిధులందరికీ భలే ఆశ్చర్యంగా వుంది. ఒక క్యూలో వేలాదిమంది మహిళలు నెత్తిన కలశాలు, ఇంకో వస్తువు పెట్టుకున్నారు. అది ఏంటని, ఎందుకు తెస్తున్నారని ఒబామా అక్కడున్న వెంకయ్యనాయుడును అడిగాడు. దానికి వెంకయ్య... అవన్నీ కూడా ఈ రాష్ట్రం లోని అన్ని గ్రామాల నుండి సేకరించిన మట్టి, నీళ్లు వున్న పాత్రలు, అమరావతి రాజధానిలో అన్ని గ్రామాలకు భాగ స్వామ్యం కల్పించాలనే సత్సంకల్పంతో చంద్రబాబు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి అన్ని గ్రామాల నుండి మట్టి, నీళ్లు తెప్పించారని చెప్పాడు. ఆ మాట వినగానే ఒబామా, పుతిన్, మోర్కెల్, డేవిడ్ కామెరూన్, షింజోఅబేలు లేచి... అయ్యో, మేమెంత తప్పు చేసాం, మా రాజధానుల శంకుస్థాపన ఇలా చేయ లేదే... ఇంత పండుగలా చేయలేదే... ఇప్పుడే మా దేశాలకు వెళ్లి, మా రాజధానులను కూల గొట్టి, ఇలాగే శంకుస్థాపన చేసి కొత్త రాజ ధానులను కడుతామంటూ బయల్దేరారు.

★★★★★

సింగపూర్‌లో ప్రధాని కార్యాలయం. ప్రధాని లీ తన మంత్రివర్గ సహచరు లతో... అసలు రాజధాని శంకుస్థాపన అంటే అది... ఏం చేసాడు ఆ చంద్ర బాబు... శంకుస్థాపనే ఈ లెవల్లో చేసా డంటే ఇక రాజధాని ఏ లెవల్లో కడ తాడో... మనం కూడా ఆయనను స్ఫూర్తిగా తీసుకుందాం. ఇప్పుడున్న భవనాలను కూలగొడదాం. అన్ని గ్రామాల నుండి మట్టి, నీళ్లు తీసుకురమ్మని చెప్పండి. అమరా వతిని మించిన విధంగా మన రాజధాని శంకుస్థాపన ఉండాలన్నాడు. వెంటనే మంత్రి ఈశ్వరన్... నీ పిచ్చి తగలెయ్యా, మన సింగపూర్‌లో గ్రామా లెక్కడున్నాయి, మట్టి, నీళ్లు తేవడానికి? సింగపూర్ పిచ్చి చంద్రబాబుకు పట్టిం దని మనం సంబర పడుతుంటే నువ్వు అమరావతి పిచ్చి తగిలించుకుని వచ్చావే... అంటూ లేచాడు.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు తుంగా జోజిరెడ్డి - మేరి రాజేశ్వరిల కుమారుడు **మైఖేల్ రెడ్డి - రాఖేల్ ప్రవళికరెడ్డి** (మహబూబనగర్ జిల్లా బ్రాహ్మణపల్లి వాస్తవ్యులు జడ్డు బాలరాజారెడ్డి - శోభారాణిల కుమార్తెల)ల పరిశుద్ధ వివాహం నెల్లూరు కొండాయపాలెంరోడ్డులోని జీసెస్ చర్చి నందు నెల్లూరు పీఠాధిపతులు ఎండి ప్రకాశం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

### రాజధాని నిర్మాణంలో..

# పాలు పంచుకోవడం అదృష్టం



నూతన రాజధాని అమరావతి నిర్మాణంలో రాష్ట్ర ప్రజలందరూ పాలు పంచుకోవడం అదృష్టమని నూతన రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు అన్నారు. రాజధాని నిర్మాణం కోసం కావలి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల నుండి, నియోజకవర్గంలోని అన్ని మండల, గ్రామాల నుండి నీరు – మట్టిని ఆయా ప్రతినిధుల ద్వారా సేకరించి ముందుగా ఆర్‌డిఓ కార్యాలయానికి చేర్చారు. అనంతరం ఆర్డీవో లక్ష్మీనరసింహం పర్యవేక్షణలో తహశీల్దార్ కె.సాంబశివరావు రాజధాని నిర్మాణ ప్రాంగణానికి తరలించారు. ఆర్డీవో కార్యాలయం నుండి బీద మస్తాన్‌రావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి సర్వమత ప్రార్థనల అనంతరం శుద్ధి నీరు – శుద్ధి మన్ను రథాలను సాగనంపారు. కావలిలో నీరు – మట్టి సేకరణకు పట్టణ అధ్యక్షులు యం.వెంకటేశ్వర్లు, పుర ఇన్‌ఛార్జి ఛైర్మెన్ జి.భరత్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షులు పాలడుగు రంగారావుల నేతృత్వంలో నాయకులు, కౌన్సిలర్లు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే మన రాష్ట్రంతో పాటు ప్రక్క రాష్ట్రాల పుణ్యక్షేత్రాల నుండి కూడా శుద్ధ నీరు – శుద్ధ మన్నును తెప్పించి శంకుస్థాపన కార్యక్రమంలో కలపడంతో నిర్మాణ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తి చేశారన్నారు.

# పారిశుద్ధ్య లోపంతోనే అంటు వ్యాధులు



కావలి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కనిపిస్తుందని, పట్టణంలో పేరుకుపోయిన చెత్త, చెదారం, మురికి కాలువల ద్వారా వ్యాధులు విజృంభిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి కందుకూరి వెంకట సత్యనారాయణ అన్నారు. ఇటీవల పట్టణంలోని 16, 19వార్డులను పరిశీలించారు. ఈ వార్డులలో అపరిశుభ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో పేరుకుపోయిన మురికి కాలువలను చూసి చలించిపోయారు. ఇటీవలికాలంలో విషజ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తున్న తరుణంలో ఈ ప్రాంతాలలో ఆయన పర్యటన ప్రాముఖ్యతను సంతరించుకుంది. వెంటనే మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లి ఈ ప్రాంతాన్ని పరిశుభ్ర పరుస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు వి.వి.రంగారెడ్డి, పార్టీ నాయకులు సివిసి సత్యం, వరలక్ష్మి, మాల్యాద్రి, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్‌సిసి క్యాంప్



కావలిలోని జవహర్ భారతి కళాశాలలో ఈ నెల 11న మొదలైన ఎన్‌సిసి క్యాంపు 20వ తేదీతో ముగిసింది. ఈ క్యాంపులో జిల్లాలోని ఎన్‌సిసి క్యాడెట్స్ మరియు ఆఫీసర్లు పాల్గొన్నారు. పలు విభాగాల్లో విద్యార్థులకు శిక్షణనిచ్చారు.

## కావలి కబుర్లు

# ప్రజల భద్రతకు భరోసా పోలీస్

**- రూరల్ సిఐ మధుబాబు**



సమాజంలో శాంతిభద్రతలను అదుపులో పెట్టి, అసాంఘిక శక్తుల ఆట కట్టించి, సంఘవిద్రోహ శక్తులను ఎదుర్కొని ప్రజల భద్రతకు భరోసా కల్పించేవాడే పోలీస్ అని కావలి రూరల్ సిఐ ఎం.మధుబాబు అన్నారు. బుధవారం పోలీస్ అమరవీరుదల దినోత్సవం సందర్భంగా డిఎస్పీ రాఘవరావు సూచనల మేరకు స్థానిక పిడిఓ కార్యాలయం నుండి డిఎస్పీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అన్వర్‌బాషా, రఘునాథ్, పుల్లారావుల పర్యవేక్షణలో పట్టణంలోని వివిధ కళాశాలల, పాఠశాలల, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులతో పాటు పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మధుబాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన వారి కుటుంబాలు సంతోషంగా ఉండాలన్నారు. అందుకు ప్రభుత్వాలు సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. నూతనంగా పోలీస్‌శాఖలోకి వచ్చే యువరక్తానికి అమరవీరులు ఆదర్శమన్నారు. విధి నిర్వహణలో ఎదురైన మృత్యువును నవ్వుతూ ఆహ్వానించిన కె.ఎస్.వ్యాస్, ఉమేష్‌చంద్ర, పరదేశనాయుడు, కృష్ణప్రసాద్‌లు పోలీసులకు స్ఫూర్తిదాయకమన్నారు. టిడిపి జిల్లా కార్యదర్శి ఆత్మకూరి బ్రహ్మయ్య మాట్లాడుతూ పోలీసులు రేయనక పగలనకా విధులు నిర్వహిస్తుంటే మనం ఇళ్ళలో హాయిగా నిద్రపోతున్నామని, వారి సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం బ్రిడ్జి సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి పోలీసు అమరవీరులకు 2నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదానం కార్యక్రమంలో రక్తదానం చేసిన వారికి సిఐ మధుబాబు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి కాలేజీ కరస్పాండెంట్ బి.అయ్యల్‌రెడ్డి, గోవిందరెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు తన్నీరు మాల్యాద్రి, డి.సుధీర్‌నాయుడు, ప్రసన్నాంజనేయులు, కాంతారావు, ఐ.సాయిప్రసాద్, వెంకటసుబ్బయ్య, రాజ, కామరాజు, మాజీమున్సిపల్ ఛైర్మెన్ నగళ్ళ శ్రీనివాస కిరణ్, దళిత నాయకులు బాలకృష్ణ, ఆర్‌విడిఎస్ బృందం సుమతి, ఇందిర, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఓదార్పు



ఈ నెల 17వ తేదీన ప్రకాశం జిల్లా కందుకూరు మండలం చెర్లోపాళెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే బెంగుళూరుకు వెళ్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి తన పర్యటన రద్దు చేసుకుని నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డితో కలిసి హుటాహుటిన చెన్నాయపాళెం గ్రామం సందర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతి చెందిన కుటుంబాల వారికి రూ. 25వేలు వంతున తన సొంత నగదును ఆర్థిక సహాయంగా అందించారు. మృతుల కుటుంబాలను కలిసి సంతాపం తెలిపిన వారిలో ఒంగోలు ఎంపి వై.వి.సుబ్బారెడ్డి, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, ప్రకాశంజిల్లా వైయస్సార్‌సీపీ అధ్యక్షులు అశోక్‌రెడ్డి ఉన్నారు.

# పోలీసుల రక్తదానం



పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఆదివారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆటో కార్మికులు, మినీ లారీ అసోసియేషన్, లారీ డ్రైవర్స్ అసోసియేషన్, ఎపిఎస్ఆర్‌టిసి కార్మికులు రక్తదానం చేశారు. కావలి 1 మరియు 2వ పట్టణ సబ్‌ఇన్స్‌పెక్టర్లు రఘునాథ్, అన్వర్‌బాషాలు ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల సంస్మరణార్థం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 30వసారి రక్తదానం చేసిన ఎపిఎస్ఆర్‌టిసి కార్మిక నాయకుడు పి.పి.సుబ్బారావును అభినందించి, జ్ఞాపిక బహుకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు గంధం ప్రసన్నాంజనేయులు, తన్నీరు మాల్యాద్రి, డి.రవిప్రకాష్, దామిశెట్టి సుధీర్‌నాయుడు, ఎ.వి.హనుమకుమార్, డా॥ కృష్ణారావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ వి.వి.రంగారెడ్డి, మాజీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీనివాసులు, ఆటో కార్మిక నాయకులు దావులూరి దేవ, కానిస్టేబుళ్లు ఈశ్వరయ్య, శ్రీకాంత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జయ.. జయహో.. దుర్గా భవానీ



శరన్నవరాత్రి మహోత్సవాలు నెల్లూరు నగరంలోని అమ్మవారి దేవస్థానాల్లో ఈ నెల 13వ తేదీ నుండి అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయాల్లో విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని పూజాది కార్యక్రమాలను, మహిళా భక్తులు దీపారాధనలు నోములు నోచుకున్నారు. అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 16వ తేదీ నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు శ్రీ అన్నపూర్ణ అలంకారంలోను, 17వ తేదీ గజలక్ష్మి అలంకారంలోను, 18వతేదీ కాళికా అలంకారంలోను, 19వ తేదీ సరస్వతి అలంకారంలోను, 20వ తేదీ శ్రీ మహాలక్ష్మి అలంకారంలోను, 21వ తేదీ శ్రీ దుర్గా అలంకారంలోను భక్తులకు దర్శనమిచ్చారు. 22వతేదీ శ్రీ రాజరాజేశ్వరి అలంకారం, శమీపూజ, పారువేట, నగరోత్సవం వైభవంగా జరిగాయి. 23వ తేదీ అమ్మవారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రాంగణంలో సంపుటీకరణ చండీహోమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ పర్యవేక్షణలో రఘురామ్మూర్తి స్వామి, సంజీవరావు స్వామి విశేషపూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ పి.కోదండరామిరెడ్డి, ఆలయ శాశ్వత ధర్మకర్త రత్నం జయరాంలు పర్యవేక్షించారు. మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నగర కార్పొరేటర్లు, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రతిరోజు సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు ఈ నెల 16వ తేదీ నుండి ప్రతి రోజు రాజరాజేశ్వరి అలంకారం, గాయత్రి అలంకారం, ధనలక్ష్మి అలంకారం, సరస్వతిదేవి అలంకారం, మహిషాసురమర్ధిని అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అమ్మవారికి శ్రీ వాసవి అష్టోత్తర సహస్ర నామార్చన, దేవీ ఖడ్గమాల, దేవీ నవావరణ పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ మునగా వెంకటేశ్వర్లు, కోశాధికారి వాయుగుండ్ల సాయి సువర్ణ, పాలకమండలి సభ్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నగర డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

నెల్లూరు మూలాపేటలో వేంచేసియున్న భక్తులచే తొలిపూజలందుకునే సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 16వ తేదీ నుండి అమ్మవారు ప్రతిరోజు సరస్వతి అలంకారం, భవానీ అలంకారం, దుర్గాదేవి అలంకారం, చండీ అలంకారం, లలితా పరమేశ్వరి, శ్రీ మహిషాసురమర్ధిని అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజు ఉదయం చండీయాగం, సాయంత్రం సామూహిక కుంకుమపూజలు వైభవంగా జరిగాయి. భక్తులు విశేషంగా పాల్గొని పూజాధికార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎ.వి.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. నెల్లూరులోని అన్ని మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

## కమర్షియల్ డిసి బదిలీ

వాణిజ్య పన్నుల శాఖ నెల్లూరు, ప్రకాశం జిల్లాల డిప్యూటీ కమిషనర్ తోట రాజశేఖర్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో పని చేస్తున్న కృష్ణమోహన్‌రెడ్డిని నియమించారు. రాజశేఖర్ కొన్ని నెలల పాటు సెలవు పెడుతుండడంతో బదిలీ కోరినట్లు తెలిసింది. ఈయన నెల్లూరులో రెండున్నర్రేళ్ల పాటు విధులు నిర్వహించారు. వాణిజ్య పన్నుల వసూళ్లలో కొత్త ఒరవడి సృష్టించారు.

## బుద్ధం.. శరణం.. గచ్ఛామి

(మొదటి పేజీ తరువాయి)

పొందడానికి విదేశీ కంపెనీలు అంత తొందరగా ముందుకు రావు. హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాలలో అయితే ఎలాంటి ఒప్పందాలకైనా వస్తారు. ఇక్కడ జాయింట్ వెంచర్ క్రింద భవనాలు కట్టాలి రమ్మంటే ఎవరొస్తారు? విదేశీ సంస్థల భాగస్వామ్యంతో కూడా అమరావతి రాజధాని అభివృద్ధి చెందుతుందని ఆశించలేము.

అమరావతికి వున్న ఆశల్లా బౌద్ధమత గురువు దలైలామా! త్వరలోనే ఆయన అమరావతిలో పర్యటిస్తారని, అమరావతి రాజధాని నిర్మాణానికి భారీ ఎత్తున ఆయన ఆర్థిక సాయం ప్రకటించే అవకాశం వుందని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. అమరావతి ఒకప్పుడు బౌద్ధ నాగరికత వెల్లివిరిసిన ప్రాంతం. ఇప్పుడు రాజధాని నిర్మాణంలోనూ చంద్రబాబు బౌద్ధ సంస్కృతికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. బౌద్ధ రామాలు, బౌద్ధ స్థూపాలు నెలకొల్పనున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ధర్మశాలలాగే ఆంధ్రప్రదేశ్‌లో అమరావతిని బౌద్ధ సంస్కృతికి ప్రధాన కేంద్రంగా మార్చే ఆలోచన వుంది. అమరావతి రాజధాని విషయంలో చంద్రబాబు కూడా సింగపూర్, జపాన్ వంటి బౌద్ధ సంస్కృతి వున్న దేశాల సహకారమే తీసుకుంటున్నారు. సంస్కృతి పరంగా కూడా ఆదేశాలను ఆకర్షించడానికి ఇదో ప్రయత్నం. అమరావతికి దలైలామా ఆశీస్సులుంటాయనే నమ్మకంతోనే చంద్రబాబు రాజధానిని భారీ ప్రణాళికతో రూపొందించినట్లు సమాచారం. మరి చంద్రబాబు కలలు ఎంతవరకు ఆ బుద్ధుడు నెరవేరుస్తాడో చూద్దాం.

### నెల్లూరు స్మార్ట్ సిటీ...

# వరమా? భారమా?

నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీల జాబితాలో చేర్చారు. అయితే దీనికి నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదు. ఇది వరమో, శాపమో కూడా అంతు బట్టడం లేదు. ఎందుకంటే నెల్లూరు స్మార్ట్‌సిటీ అనేది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో లేదు. రాష్ట్ర ప్రభుత్వం అమెరికాకు చెందిన సిఐఐ సంస్థతో చేసుకున్న ఒప్పందంలో మాత్రమే వుంది. కాబట్టి నెల్లూరు స్మార్ట్‌సిటీగా రూపొందడానికి కేంద్రం నుండి నిధులొచ్చే అవకాశాలు లేవు. స్మార్ట్ సిటీలకు కేంద్రం ఏడాదికి వందకోట్ల రూపాయల వంతున కేటాయిస్తుంది. అవి నెల్లూరుకు లభించవు.

2014 ఎన్నికల్లో ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా 100 స్మార్ట్ సిటీలను ఎంపిక చేయడం జరిగింది. కేంద్ర మంత్రి వర్గంలో మన జిల్లావాడు వెంకయ్యనాయుడు వుండడం, ఆయనకు నరేంద్ర మోడీతో చనువు వుండడంతో ఖచ్చితంగా నెల్లూరు స్మార్ట్ సిటీల జాబితాలో చేరుతుందనుకున్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన 100 స్మార్ట్ సిటీల జాబితాలో నెల్లూరుకు స్థానం దక్కక పోవడంతో నెల్లూరీయులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఏపి నుండి విశాఖ, కాకినాడ, తిరుపతిలను మాత్రమే స్మార్ట్‌సిటీలుగా ఎంపిక చేయడం జరిగింది. తాజాగా నెల్లూరును స్మార్ట్ సిటీగా ప్రకటించారు. అయితే ఇది కేంద్రం స్మార్ట్ సిటీల జాబితాలో కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అమెరికా సంస్థ సిఐఐతో చేసుకున్న ఒప్పందంలో వున్నట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ఆ సంస్థ నగరాభివృద్ధికి ఎన్ని నిధులు ఖర్చు చేసినా తిరిగి ప్రజల నుండే వివిధ రకాల సెస్సుల రూపంలో వసూలు చేస్తారనే ప్రచారం వుంది. ఇప్పటికే నెల్లూరుకు 1100కోట్ల హడ్కో ఋణం అన్నారు. తర్వాత దానిని జైకాకు మళ్లించారు. ఇది కూడా తిరిగి చెల్లించాల్సిన అప్పులే! ప్రజల ముక్కుపిండి పన్నులు వసూలు చేసి కట్టాల్సిందే! కేంద్ర నిధులతో కాకుండా పన్నుల రూపంలో మా రక్తాన్ని పీల్చి పిప్పిచేసే స్మార్ట్‌సిటీలు మాకు అక్కర్లేదనేది ప్రజల అభిప్రాయం.

## జూబ్లీ ఆసుపత్రికి రిజిస్ట్రేషన్ కార్యాలయం



నెల్లూరుజిల్లా కోర్టు కాంపౌండ్‌లో వున్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 1, 2 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, మద్రాసు బస్టాండ్ వద్దనున్న ప్రభుత్వ జూబ్లీ ఆసుపత్రి భవనంలోకి మార్చు చేయాలని జిల్లా కలెక్టర్ యం.జానకి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రస్తుతమున్న జూబ్లీ ఆసుపత్రిని దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనంలోకి మార్చారు. జూబ్లీ ఆసుపత్రి భవనంలోకి ఒక వైపు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని, మరోవైపు ఆయుష్ విభాగాలకు చెందిన పలు ఆసుపత్రులను తరలించే ప్రయత్నం జరుగుతోంది. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని మారుస్తామని జిల్లా రిజిస్ట్రార్ యం.అబ్రహం తెలిపారు. బ్రిటీష్‌వారి హయాంలో 1901లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించారు. అంతటి ఘన చరిత్ర వున్న రిజిస్ట్రార్ కార్యాలయం అక్కడక్కడా స్లాబు పెచ్చులూడి వర్షాకాలంలో వురుస్తుంది. అదీగాక భవనం పాతబడి వున్నందున విలువైన సమాచారం వుండే రికార్డు గది చెదలు పట్టే అవకాశం వుంది. ఈమధ్య కాలంలో రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పాత మునిసిపల్ కార్యాలయం, పాత జడ్పీ కార్యాలయాలకు మార్చాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖ నూతన భవన నిర్మాణం కోసం నెల్లూరు ఆర్‌టిఓ కార్యాలయం ప్రక్కన స్థలం మంజూరు చేసినా నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు.

## కండలేరులో అవినీతి కంపు వాస్తవమే

నెల్లూరుజిల్లాలోని కండలేరు జలాశయ పరిధిలో రైతులకు నీరందించేందుకు ఎత్తిపోతల పథకం ద్వారా చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఉన్నత న్యాయస్థానం నిర్ధారణకు వచ్చింది. కండలేరు జలాశయ పరిధిలోని పొదలకూరు, నెల్లూరురూరల్ తదితర మండలాల పరిధిలోని ఆయకట్టు రైతులకు నీరందించేందుకు ఆగస్టు 25న ప్రభుత్వం 551జీవో ద్వారా 67.44 లక్షల రూపాయలను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ పనులను రైతులకు కేటాయించాలి. కానీ అప్పటి ఇంజనీరింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ కింద పనులు విభజించారు. ఈ పనుల్లో అవకతవకలు జరిగాయని రైతులు కోర్టును ఆశ్రయించారు. ఫిర్యాదును పరిశీలించిన న్యాయస్థానం, పలు అంశాలపై అధికారులను వివరణ కోరడంతో పాటు పనులు జరిగిన తీరుపై కూడా అసంతృప్తిని వ్యక్తం చేసింది. రైతుల ఫిర్యాదు మేరకు కొన్ని నిర్ణయాలు తీసుకున్న న్యాయస్థానం ప్రస్తుత ఇరిగేషన్ శాఖ అధికారులు కోర్టుకు సమర్పించిన రికార్డులు తిరిగి ఆ శాఖకు అప్పగించకుండా ప్రభుత్వానికి పంపాలని ఆదేశించింది. రికార్డులు ప్రభుత్వానికి చేరిన తర్వాత అవకతవకలకు పాల్పడినవారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

## తప్పా? ఒప్పా?

(మొదటి పేజీ తరువాయి)

అదే మర్యాదను పాటిస్తూ శంకుస్థాపనకు వచ్చాడు. ఈ రాష్ట్రం ఎటు పోయినా ఆయనకు నష్టం లేదు, పచ్చటి పొలాలను నాశనం చేసి రాజధాని కట్టినా ఆయనకు సంబంధం లేదు కాబట్టి వచ్చాడు. అదివేరే విషయం. కాని ఓటు, నోటు కేసులో చంద్రబాబు –కేసీఆర్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండేంత వైరం వుంది. అయినా కేసీఆర్ సాంప్రదాయ విలువలను పాటిస్తూ దానిని పక్కన పెట్టాడు. జగన్ ఆహ్వానాన్ని వద్దన కూడదు. ఆయనను చంద్రబాబు వెళ్లి ఆహ్వానించేవాడా? లేక మంత్రులు వెళ్లి పిలిచేవాళ్లా? లేక గుమస్తాలు వెళ్లి ఆహ్వానపత్రిక అందించి ఉండేవాళ్లా... అనేది వేరే విషయం. ప్రభుత్వం నుండి ఆహ్వానం అందే తీరును బట్టి జగన్‌కు ప్లస్సో, మైనస్సో వుండేది.

జగన్ ఆహ్వానం తీసుకుని వుంటే ఎంతో హుందాగా వుండేది. ఆ తర్వాత తాను హాజరు కాకపోయి వుంటే బాగుండేది. శంకుస్థాపనకు హాజరు కాకపోవడానికి ఆయన చెప్పిన కారణాలను మాత్రం ప్రజలు సమర్ధిస్తున్నారు. పచ్చని పొలాలను నాశనం చేస్తూ రైతుల భూములను బలవంతంగా లాక్కుని రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తాను భాగస్వామిని కాదలచుకోలేదని, అందుకే శంకుస్థాపనకు రానని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పాడు. ఇది వాస్తవమే. రాజధానిపై ఎక్కువ మందిలో వున్న అభిప్రాయం కూడా ఇదే! శంకుస్థాపన ఆహ్వానం తీసుకుని ఆయన ఈ కారణాలతో ఎగ్గొట్టి వుంటే ఆయన రాజకీయ ప్రతిష్ట మరింత ఇనుమడించేది.

## తెలంగాణకు శిక్షణ కలెక్టర్

జిల్లాలో గత కొంతకాలంగా ట్రైనీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సిక్తాపట్నాయక్‌ను తెలంగాణ రాష్ట్ర సర్వీసుకు కేటాయించారు. ఆరు నెలల నుండి ఆమె జిల్లాలో వుంటూ వివిధ శాఖల పని తీరుతెన్నులను తెలుసుకుంటూ నెల్లూరుజిల్లాతో కొంత బంధాన్ని పెంచుకున్నారు.


**గ్రామ పంచాయితీ కార్యాలయము, ఇందుకూరుపేట బిట్-1**

**బహిరంగవేలము ప్రకటన**

**ఆర్.ఓ.సి.నెం.25/2015** **తేది.19.10.2015**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, ఇందుకూరుపేట మండలం, ఇందుకూరుపేట బిట్–1 గ్రామ పంచాయితీ కార్యాలయము వద్ద వున్న పంచాయితీ షాపు రూములు 1, 2, 3, 5 మరియు 6ర్లు గల వాటి లీజు అనుభవ హక్కును తేది. 16–10–2015 నుండి తేది. 15–10–2016 వరకు ఒక సంవత్సరము పాటు అనుభవించు కొనుటకు తేది. 28–10–2015 ఉదయము 11గం.లకు ఇందుకూరు పేట బిట్–1 గ్రామ పంచాయితీ కార్యాలయము వద్ద పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచేగాని బహిరంగ వేలము వేయబడును.

**షరతులు**

1. వేలము పాటలో పాల్గొను వారు 1వ నెంబరు రూముకు ధరావత్తు రూ.3000/–లు, మరియు 2, 3, 5, 6నెం. రూములకు ధరావత్తు ఒక్కొక్కదానికి రూ.2000/–లు పాటకు ముందుగా చెల్లించి పాటలో పాల్గొనవలెను.
2. హెచ్చు పాటదారుడు వేలం పాట ఖాయపరిచిన వెంటనే పాట మొత్తము గ్రామ పంచాయితీకి చెల్లించవలెను.
3. ఏ కారణము తెలుపకనే వేలము పాట నిలుపుదల చేయుటకు, వాయిదా వేయుటకు గ్రామ పంచాయితీకి అధికారము కలదు.
4. షాపు రూము నెంబరు 4ను ప్రభుత్వ నిబంధనముల మేరకు షెడ్యూల్డు కులముల వారికి కేటాయించడమైనది.

మిగిలిన విషయములు, నిబంధనల గురించి ఈ కార్యాలయము పనివేళలయందు వచ్చి తెలుసుకొనవచ్చును.

**సం/- పి.మల్లిఖార్జునరావు, పంచాయతీ కార్యదర్శి,**
**ఇందుకూరుపేట బిట్-1 గ్రామ పంచాయితి,**
**ఇందుకూరుపేట మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా.**

# జిల్లాకు జ్వరమొచ్చింది

## • బాధల్లో ప్రజలు..పట్టించుకోని అధికారులు

*జిల్లాలో ఎక్కడ చూసినా మాయదారి జ్వరాలే. ఈ జ్వరాలతో సామాన్య జనం నానా బాధలు పడుతున్నారు. ఆసుపత్రులన్నీ జ్వరగ్రస్తులతో కిటకిటలాడుతున్నాయి. అయినా, ప్రభుత్వ వైద్యసిబ్బంది తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే.*



ముఖ్యంగా, నెల్లూరు నగరంలో ఈ వైరల్ ఫీవర్స్ జనాన్ని మరింతగా బెంబేలెత్తిస్తున్నాయి. ప్రతి వీధినా ఈ జ్వరాలతో వణికిపోయేవారి సంఖ్య గణనీయంగానే వుంటోంది. నగరంలో ఎక్కడ చూసినా మురుగుదిబ్బలు, చెత్తా చెదారాలు పేరుకుని, దోమలు విపరీతంగా ప్రబలిపోయి నానా రోగాలకూ కారణమవుతున్నా అధికారగణం పట్టించుకోవడం లేదు. రోజురోజుకూ నగరం భరించలేనంతగా దుర్గంధ పూరితంగా మారుతున్నా అటు కార్పొరేషన్ అధికారులు కానీ, ఇటు జిల్లా ఉన్నతాధికారులు కానీ పట్టించుకోకపోవడంతో ఎవరి బాధ వారిదే అన్నట్లుగా తయారైంది. విషజ్వరాలు, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వుండడంతో ముఖ్యంగా పేదప్రజలు, మధ్య తరగతి ప్రజల బాధలు వర్ణనాతీతంగా వుంటున్నాయి. ప్రధానంగా నెల్లూరులోని అనేక జనసమ్మర్ధం కలిగిన ప్రాంతాలు మురికికూపాలుగా మారిపోయివున్నాయి. ఏసి కూరగాయల మార్కెట్, పెద్దబజారు, చిన్నబజారు, స్టోన్‌హౌస్‌పేట, మూలాపేట, ఫత్తేఖాన్‌పేట, రంగనాయకులపేట, దర్గామిట్ట, వేదాయపాళెం తదితర ప్రధాన ప్రాంతాల్లో సైతం అనేక వీధులు చెత్తకుప్పలమయంగా వున్నాయి. క్రమబద్ధంగా చెత్తకుప్పలను ఎత్తివేయకపోవడం, మురుగుదిబ్బలు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోకపోవడం వంటి కారణాలతో మొత్తంగా నెల్లూరు నగరం ఒక చెత్తకుప్పల నగరంగా మారిపోయింది. ఇక ఏసి నగర్, బాలాజీనగర్, ఎన్టీఆర్ నగర్ వంటి ప్రాంతాలు దోమలపుట్టలుగా మారిపోయాయి. పగలు-రాత్రీ ఈ దోమల బాధ అనుభవించే ప్రజల యాతన వర్ణనాతీతం. ఇంత పెద్ద నెల్లూరు నగరంలో జనం రోజురోజుకు పెరిగిపోతూనే వున్నా అందుకు తగ్గట్టుగా డ్రైనేజీ స్కీమ్ లేకపోవడంతో, నగరంలోని మురుగునీరు ఎటూ వెళ్ళే మార్గం లేక రోడ్లపైనే కాలువల్లా ప్రవహిస్తున్నాయి. నగరం మధ్యలో ప్రవహిస్తున్న సర్వేపల్లి కాలువను చూస్తే చాలు మన నగరం ఎంత సుందరంగా వుందో తేటతెల్లమవుతుంది. పరమరోతగా, దుర్గంధ భూయిష్టంగా వున్న ఈ కాలువను పరిశుభ్రం చేసే నాథులే కనిపించడం లేదు. దోమలకు నిలయంగా, అపరిశుభ్రతకు ఆలవాలంగా వున్న ప్రాంతాలకు నెల్లూరులో కొదవ లేదు. నెల్లూరు ఎంతో చరిత్రాత్మకమైన నగరమని, నెల్లూరును సుందర సింహపురి నగరంగా తీర్చిదిద్దుతామని అంటుంటారే తప్ప ఆచరణ మాత్రం వుండదు. కార్పొరేషన్‌వారు, ఎప్పటికప్పుడు కొత్త కొత్త పథకాలు వల్లెవేసే పాలకులు నెల్లూరు నగరాన్ని పరిశుభ్రంగా వుంచేందుకు మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం ప్రజలకు తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ఏళ్ళ తరబడిగా ఈ సమస్య ఇలాగే వుంటున్నా, చిన్న వానకే నెల్లూరు రోడ్లు మురుగుకాలువలుగా..రోతగా తయారవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం నెల్లూరు దౌర్భాగ్యమనే చెప్పాలి. దీంతో, నెల్లూరంతా దుర్గంధపూరిత వాతావరణం అలముకుని విషజ్వరాలకు నిలయంగా మారింది. గత కొద్ది రోజులుగా నానా రకాల జ్వరాలు విజృంభిస్తున్నాయి. బాగా ఆరోగ్యంగా తిరుగుతున్నవారు సైతం హటాత్తుగా తలనొప్పి, జ్వరం, చలి, జలుబు, వళ్లు నొప్పులు అంటూ నీరసపడిపోతున్నారు. కనీసం రెండు మూడు రోజులపాటు వారు పడే బాధ వర్ణనాతీతం. కొందరికి కొద్ది రోజుల్లోనే జ్వరాలు తగ్గితే, మరికొందరి పరిస్థితి విషమం దాకా వస్తోంది. ఆర్థికస్తోమత వున్న రోగులు మాత్రం వెంటనే దూరప్రాంతాల ఆసుపత్రులకు తరలిపోతున్నారు. మిగిలినవారంతా దేవుడిపై భారం వేసి ఇక్కడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రత్యేకించి ఈ జ్వరాలకు, వ్యాధులకు కారణమైన దోమలను నివారించేందుకు కార్పొరేషన్ అధికారులు కనీసం ఫాగింగ్ కూడా చేయకపోవడం దారుణమని, జిల్లా వైద్యఆరోగ్యశాఖవారు జ్వరాల పట్ల, వ్యాధుల నివారణ పట్ల ప్రజలకు కనీసం అవగాహన కూడా కలిగించకపోవడం దురదృష్టకరమని ప్రజలు వాపోతున్నారు. కార్పొరేషన్‌వారి ఫాగింగ్ యంత్రాలేమైనాయో, ప్రజారోగ్యం కోసం కేటాయించిన నిధులు ఏమవుతున్నాయో ఎవరికీ అంతుపట్టడం లేదనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి. జ్వరాల పట్ల ప్రజల్లో ఇంత అసహనం, అసంతృప్తి వున్నా అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేకపోవడం విశేషం. జ్వరాలతో జనం బాధలు పడుతూనే వున్నా, అధికారగణం, సిబ్బంది మాత్రం నిర్లిప్తంగానే వుండడం, ఉన్నతాధికారులెవరైనా తనిఖీలకు వచ్చినప్పుడు మాత్రం అప్పటికప్పుడు ఆ పరిసరాలన్నిటినీ క్షణాల్లో శుభ్రం చేయించి ప్రతినిత్యం ఇలాగే ఎంతో శుభ్రతతో వుంటున్నట్లు చెప్పుకుని వారి మెప్పు పొందడం సర్వసాధారణమై పోయింది. గతంలో ఎన్నడూలేనంతగా, నెల్లూరు ప్రజలు, జిల్లా ప్రజానీకం గత కొద్ది రోజులుగా జ్వరాలతో ఇంతగా బాధలు పడుతున్నా, జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపి ప్రజలను అప్రమత్తం చేసే సిబ్బంది కరువయ్యారు. అవసరమైన వైద్యసదుపాయాలు అందించే నాథులే కనుమరుగయ్యారు. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ప్రజారోగ్యం పట్ల అలక్ష్యం ప్రదర్శిస్తుండడం విచారకరం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలసి ఈ పరిస్థితులను సమీక్షించి, నగరాన్ని పరిశుభ్రంగా వుంచేందుకు, దోమలను నివారించేందుకు, జ్వరపీడితులకు తక్షణ వైద్యసాయం అందించేందుకు సత్వర చర్యలు తీసుకోవడం ఎంతైనా అవసరం. ఒక్క నెల్లూరులోనే కాదు, జిల్లావ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి.

# హోదాపై మాట మార్చారు!



రాష్ట్ర విభజన సమయంలో తాము అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్ల పాటు ప్రత్యేకహోదా కల్పిస్తామన్న బీజేపీ నాయకులు అధికారంలోకి రాగానే మాట తప్పారని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్ విమర్శించారు. ప్రత్యేకహోదా సాధన పోరాటంలో భాగంగా 20వ తేదీన నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీజేపీ, టీడీపీలు రెండూ ఈ రాష్ట్ర ప్రజలను మోసం చేసాయన్నారు. ప్రత్యేకహోదా వద్దు, ప్రత్యేక ప్యాకేజీయే ముద్దంటూ చంద్రబాబు ఈ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నాడంటూ ధ్వజమెత్తారు. ప్రత్యేకహోదా కోసం ప్రభుత్వం ప్రయత్నించడం లేదని, ప్రభుత్వం చేయలేని పనిని ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి చేస్తుంటే ఓర్వలేనితనంతో మంత్రులు విమర్శలు చేయడం విచిత్రంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఏకతాటిపై ఉద్యమిస్తే ప్రత్యేకహోదా తప్పకుండా సాధించగలమన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు రవిచంద్ర, ఖలీల్ అహ్మద్, అశోక్, డి.వెంకటేశ్వర్లు, ఎల్.వెంకటేశ్వరరెడ్డి, జి.సుధీర్‌బాబు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.




అక్టోబర్ 21వ తేదీ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి

# తిరిగొచ్చిన కోటంరెడ్డి



తన కాలి నొప్పికి ఆయుర్వేద చికిత్స కోసం కోయంబత్తూరు వెళ్లిన నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ నెల 20వ తేదీ రాత్రి నెల్లూరుకు తిరిగి వచ్చారు. దాదాపు 20రోజుల పాటు ఆయన అక్కడ చికిత్స పొందుతూ నెల్లూరుకు దూరంగా గడిపారు. తాను లేకపోయినా ఈ 20రోజుల పాటు పార్టీ కార్యక్రమాలు ఆగకుండా ఐదు మంది సభ్యులతో ఓ కమిటీని నియమించడం తెలిసిందే!



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com